నవతెలంగాణ

మెదక్

మంగళవారం | 13 ఆగస్టు 2024 | www.navatelangana.com

1

సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం

కాంగ్రెస్ పార్టీ సిద్ధిపేట నియోజకవర్గం ఇంచార్జ్ పూజల హరికృష్ణ

నవ తెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేదని, ఆ పూర్వ వైభవాన్ని మళ్లీ తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ సిద్ధిపేట నియోజకవర్గం ఇంచార్జ్ పూజల హరికృష్ణ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి నాయకులు మిద్దె రవి, సీనియర్ మహిళ బీఆర్ఎస్ నాయకురాలు సంతోషతో పాటు, అనుచరులు హైదరాబాదులో సోమవారం కాంగ్రెస్ పార్టీలో మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 6 గ్యారంటీలు, రైతులకు ఇస్తామన్న రుణమాఫీని అమలు చేసి చూపెట్టిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. రైతుల రుణమాఫీ చారిత్రాత్మకమని, దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని సాహసాన్ని సీఎం రేవంత్ రెడ్డి రైతుల కోసం చేసి చూపెట్టారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే ఎంతో అద్భుతం జరిగిందన్నారు. మరో పదేళ్లపాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని, రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుం



దన్నారు. రాబోయే స్థానిక పంచాయతీ ఎన్నికల్లో సిద్దిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పై చేయి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దరిపల్లి చంద్రం, నాయకులు సాకీ ఆనంద్, బుచ్చిరెడ్డి, రియాజ్, అత్తు, మహేందర్, పయ్యావుల సందీప్, మార్క సతీష్ గౌడ్, కలిముద్దీన్, రాషద్ పాల్గొన్నారు.

కోహిర్ ఎస్సైపై బదిలీ వేటు

నవతెలంగాణ వార్తకు స్పందన



నవతెలంగాణ-జహీరాబాద్

కోహిర్ మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన నిరుపేదలను వారి భూముల పొజిషన్ నుంచి తప్పించి.. రియల్ వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరించారనే నేపథ్యంలో కోహిర్ ఎస్ఐని జిల్లా ఉన్నత అధికారులు బదిలీ చేశారు. పేదల భూములపై రియేటర్ల కన్ను అన్న శీర్షికన సోమవారం రోజున నవతెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన వార్తకు జిల్లా అధికారులు స్పందించి చర్య తీసుకున్నట్టు తెలిసింది.

బోల్ భం కవార్డ్ పూజలో పాల్గొన్న ప్రవీణ్ రెడ్డి



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాలిటీకి చెందిన బీహార్ వాసులు అత్యంత భక్తిశ్రద్దలతో సోమవారం నిర్వహించిన బోల్ భం కవాడ్ యాత్రలో మున్సిపల్ యువజన నాయకుడు ప్రవీణ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం శివ భక్తుల కోసం అన్న సమారాధన ఏర్పాటు చేసి వితరణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక పాత శివాలయం నుంచి పవిత్ర గంగా జలాన్ని కావడిగా తలపై మోసుకొని కొడ కంచి గ్రామ సమీపంలోని అమ్మ చెరువు వద్దకు పాదయాత్రగా వెళ్లి శివలింగాన్ని తయారుచేసి చెరువులోని జలాలతో పూజలు నిర్వహించారు. పూజించిన జలాలతో తిరిగి మళ్లీ పాదయాత్రగా శివాలయం చేరుకొని లింగానికి గంగతో ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. కాగా ఇతర రాష్ట్రాల భక్తులు నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం ఆనందంగా ఉందని ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మ, శర్మ, సురేష్, శివ భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

పొన్నాలలోని టోల్గేట్ రెస్టారెంట్లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ



నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

ఎఫ్ఓఎస్ సిఓఎస్ యాప్ వీడియో టికెట్ నెంబర్ పై ఫిర్యాదు అందడంతో సోమవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల సమీపంలోని టోల్గేట్ హెూటల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెూటల్ సమీపంలో వంటగది అపరిశుభ్రంగా ఉన్నట్లు హెయిర్ నెట్, గ్లౌజ్ లేకుండా ఫుడ్ హ్యాండర్లు ఉన్న విషయాన్ని గుర్తించినట్లు తెలిపారు అదేవిధంగా డస్ట్ బిన్లు మూతలు లేకుండా ఉన్నాయని, పాక్షికంగా తయారు చేసిన ఆహార పదార్థాలు నేలపై ఉంచారని, అవి కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. ఫుడ్ హ్యాండర్లు మెడికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్లు అందుబాటులో లేవని ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు సంస్థకు షోకాజ్ నోటీసు జారీ చేశామని ఎఫ్ఎస్ 2006 చట్ట ప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు.

ఏస్గిలో ఓ యువతికి డెంగ్యూ పాజిటివ్

నవతెలంగాణ-మనూర్



నాగలిగిద్దా మండలంలోని ఏస్గి గ్రామానికి చెందిన ఓ యువతికి డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్టు వైద్యు రాలు డా.జావీరియాబేగం తెలిపారు. గ్రామానికి చెందిన ఎలీషా సోమాజిగూడలోని జాయ్ ఆసుపత్రిలో జేఎస్ఎమ్‌గా పనిఏస్తున్నది. వారం రోజులుగా ఆమె జ్వరంతో బాధ పడుతున్నది. జ్వరం తగ్గకపోవడంతో స్వగ్రామమైన ఏస్గికి వచ్చి.. కారసగుత్తి ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేసుకున్నది. ఈ పరీక్షలో ఆమెకు డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్టు వైద్యురాలు తెలిపారు. ఈ మేరకు ఆమెకు చికిత్స అందిస్తున్నామని..ప్రస్తుతానికి జ్వరంతగ్గినట్టు డాక్టర్ తెలిపారు.

ఏస్గి గ్రామంలో వైద్య శిబిరం..

గ్రామంలో డెంగ్యూ పాజిటివ్ రావడంతో అప్రమత్తమై వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ రాజశేఖర్, ఎంపీవో మహేష్‌కుమార్‌లు తెలిపారు. వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం, తాగునీరు శుభ్ర పరచడం, చెత్త చెదారం తొలగించడం వంటి చర్యలు చేపట్టినట్టు చెప్పారు. పంచాయతీ కార్యదర్శి అనిల్, ఆరోగ్య కేంద్రం సిబ్బంది గ్రామంలో ఉండి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ప్రజల సహకారంతో తప్పకుండా రెవెన్యూ డివిజన్ సాధిస్తా

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి
- బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-చేర్యాల

ప్రజల సహకారంతో తప్పకుండా చేర్యాల రెవిన్యూ డివిజన్ సాధిస్తానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. చేర్యాల మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం చేర్యాల పట్టణం, చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూలిమిట్ట మండలాలకు చెందిన 147 మందికి రూ.39.1 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేయించి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ చేర్యాల డివిజన్ ఏర్పాటు అంశాన్ని ఇప్పటికే అసెంబ్లీలో మాట్లాడినట్లు తెలిపారు. ఈ ప్రాంత రైతులకు సాగు నీటిని అందించేందుకు తపస్పల్లి, లద్దునూరు రిజర్వాయర్లు నింపాలని అసెంబ్లీలో పోరాటం చేశానని, త్వరలో తపస్పల్లి, లద్దునూరు రిజర్వాయర్లకు గోదావరి నీరు రానున్నట్లు పేర్కొన్నారు. తపస్ పల్లి నుంచి నీళ్లను ఎత్తుకుపోతున్నారని కొందరు అవగాహన లేకుండా ఆరోపణలు చేస్తున్నారని తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. చేర్యాల అభివృద్ధి కోసం తాను నిధులు మంజూరు చేయిస్తే కొందరు తమ ఇంటి ఎదుట, కాలనీలో సీసీ రోడ్లు నిర్మించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం మండల పరిధిలోని వీరన్నపేట గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చేర్యాల పట్టణంతోపాటు నాలుగు మండలాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ చేంజ్...
మాకొద్దు



- కంది జంక్షన్‌కు కలపాలంటున్న రైతులు
- ప్రత్యామ్నాయమున్నా పట్టని వైనం
- భూమంతా పోయాక ఊర్లో ఉండి బతికేదెలా..?
- గిర్మాపూర్‌లో బలవంతపు భూ సేకరణకు సర్వే
- ఎంత పరిహారమిస్తారో చెప్పని అధికారులు
- అలైన్‌మెంట్ మార్చాలని కలెక్టర్‌కు వినతి

గిర్మాపూర్‌లో నిర్మించే భారీ ఇంటర్ చేంజ్ మాకొద్దంటూ రైతులు ఆందోళన బాట పట్టారు. భూమంతా రోడ్డుకు పోతే ఊర్లో ఉండి బతికేదెట్ల అని నిలదీస్తున్నారు. ఇంటర్ చేంజ్ జంక్షన్‌ను అలైన్‌మెంట్‌ను మార్చి హైదరాబాద్-నాందేడ్ హైవేపై ఉన్న కంది జంక్షన్‌కు కలపాలనే ప్రతిపాదన పరిశీలించాలనే డిమాండ్ ముందుకొస్తుంది. ఎంత పరిహారమిస్తారో చెప్పకుండా రాత పూర్వకంగా ఇచ్చిన పిర్యాదుల పై ఏలాంటి వివరణ ఇవ్వకుండా బలవంతపు సర్వే చేయడం ఏంటని నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని అలైన్‌మెంట్ మార్చడమా..? లేక ప్రత్యామ్నాయంగా భూముల్ని సేకరించడమా..? ఆలోచించాలనే డిమాండ్ బలపడుతుంది.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

త్రిబుల్ ఆర్ ఉత్తర భాగంలో భాగంగా నిర్మించబోయే గిర్మాపూర్ ఇంటర్ చేంజ్ విషయంలో రైతుల నుంచి అభ్యంతరాలున్నాయి. భూ సేకరణ వల్ల ఊరంతా నిర్వాసితులు అవుతారు. త్రిబుల్ ఆర్ రోడ్డు నిర్మాణంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్, సంగారెడ్డి జిల్లా కేంద్రానికి సమీపంలోని గిర్మాపూర్‌లో రెండు ఇంటర్ చేంజ్‌లను నిర్మించాలని త్రిబుల్ ఆర్ ప్రాజెక్టులో నిర్ణయించారు. ఇప్పటికే నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఫైనల్ చేసిన డీపీఆర్ ప్రకారం కొండాపూర్ మండలంలోని గిర్మాపూర్, సదాశివపేట మండలంలోని పెద్దాపూర్ గ్రామాల్లో భారీ ఇంటర్ చేంజ్ జంక్షన్ నిర్మించనున్నారు. ఇందు కోసం అవసరమైన భూమిని గిర్మాపూర్‌కు చెందిన రైతుల నుంచి సేకరించాలని నిర్ణయించారు. ఇప్పటికే గిర్మాపూర్ ఇంటర్ చేంజ్ జంక్షన్ కోసం అవసరమైన భూముల్ని రెవెన్యూ అధికారులు గుర్తించారు. గిర్మాపూర్ గ్రామానికి చెందిన 120 మంది రైతులకు చెందిన 102 ఎకరాల పట్టా భూముల్ని త్రిబుల్‌ఆర్ కోసం సేకరించేందుకు మార్కింగ్ చేశారు. ఊర్లో ఉన్న 200 కుటుంబాలకు గాను 80 శాతం కుటుంబాలు భూముల్ని కోల్పోతాయి. అందులో గుంట నుంచి ఆరేడు ఎకరాల వరకు భూముల్ని కోల్పోయే పరిస్థితి ఉంది.



అలైన్‌మెంట్ మార్చి...ఊరిని కాపాడాలనే డిమాండ్

గిర్మాపూర్‌లో నిర్మించబోయే భారీ ఇంటర్ చేంజ్ జంక్షన్‌కు సంబంధించిన అలైన్‌మెంట్‌ను మార్చాలనే వాదన బలపడుతోంది. గతంలో ఇక్కడ ప్రతిపాదించిన ఇంటర్ చేంజ్ సైజ్ చాలా చిన్నదిగా ఉండేది. అందుకు అవసరమైన భూములు కూడా తక్కువే సేకరించాల్సి వచ్చేది. అయితే ఎక్స్ టెండెడ్ డంబుల్ డిజైన్‌ను ఎంపిక చేశారు. తొలి దశలో నాలుగు వరసలతో త్రిబుల్ ఆర్ నిర్మిస్తారు. త్రిబుల్ ఆర్ రోడ్డు ప్రధాన కూడలికి ఇరువైపులా ఒకటిన్నర కిలో మీటర్ల దూరం చొప్పున మూడు కిలో మీటర్ల విడివిగా ఈ లూప్ రోడ్డు ఉంటుంది. సంగారెడ్డి నుంచి గజ్వేల్ వరకు ఏడు కూడళ్ల నిర్మిస్తారు. అయితే గిర్మాపూర్‌లో నిర్మించే ప్రధాన ఇంటర్ చేంజ్ కోసం వంద ఎకరాల వరకు సేకరిస్తారు. అంత భారీ స్థాయిలో భూముల్ని సేకరించడం వల్ల ఊరంతా తీవ్రంగా నష్టపోనుంది. నిర్వాసితులు కాబోయే రైతులకు సంబంధించి మొత్తం భూములు రోడ్డు కోసం పోయే అవకాశముంది. భారీ ఎత్తున ఊరంతా భూములు కోల్పోవడం వల్ల గిర్మాపూర్ ఉనికే ప్రమాదం కానుంది. అందుకే నష్టాని తగ్గించేందుకు గిర్మాపూర్‌లో డిజైన్ చేసిన ఇంటర్ చేంజ్ అలైన్‌మెంట్‌ను మార్పు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యామ్నాయంగా హైదరాబాద్-నాందేడ్ వరకు నిర్మించిన హైవేలో భాగంగా కంది వద్ద భారీ జంక్షన్‌ను ఇటీవలే నిర్మించారు. హైదరాబాద్-పూణే 65 రోడ్డు దాటేందుకు వీలుగా కంది వద్ద జంక్షన్ నిర్మించారు. త్రిబుల్ ఆర్‌లో ఫైనల్ చేసి గిర్మాపూర్ ఇంటర్ చేంజ్‌ను కంది జంక్షన్‌కు మార్పు చేయడం ద్వారా భారీ ఎత్తున భూ సేకరణ చేయాల్సిన అవసరముండదు. ఇప్పటికే కొందరు రైతుల నుంచి భూముల్ని సేకరించి జంక్షన్ నిర్మించారు. అక్కడే ఇంకొంత భూమి సేకరించి అక్కడ నిర్మించిన జంక్షన్‌ను ఇంకొంత విస్తరిస్తే సరిపోతుందని రైతు సంఘాలు సూచిస్తున్నాయి. గిర్మాపూర్, పెద్దాపూర్‌లో త్రిబుల్ ఆర్ రోడ్డు కోసం కొంత మేరకు భూములు పోతే అభ్యంతరం తెలకపోయేవాళ్లమని రైతులు చెబుతున్నారు. ఇంటర్ చేంజ్ కోసం వంద ఎకరాలకు పైగా ఒకే ఊరికి చెందిన విలువైన భూముల్ని తీసుకోవడం వల్ల ఊరంతా నిర్వాసితులం అవుతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా గిర్మాపూర్ రైతులకు చెందిన పట్టా భూముల్నే కాకుండా అలైన్‌మెంట్‌ను కొంత మార్పు చేస్తే గిర్మాపూర్‌కు ఎగువ, దిగువన వంద ఎకరాల వరకు ప్రభుత్వ భూములు లభ్యమవుతాయని రైతులు పేర్కొంటున్నారు.

ఎంత పరిహారమిస్తారో చెప్పకుండా బలవంతంపు సర్వే

ఒక వేళ రైతులు భూములు ఇవ్వాల్సి వస్తే పరిహారం ఎంత ఇస్తారనే విషయాన్ని ఇంత వరకు అధికారులు చెప్పట్లేదు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూమికి భూమి ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఒక వేళ మార్కెట్ విలువకు మూడింతలు కలిపి పరిహారం ఇవ్వాల్సి వస్తే ప్రస్తుతం ఎకరం ధర రూ.6 కోట్లు ఉన్నందున ఆ లెక్కన నష్టపరిహారం లెక్కించి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా ప్రతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, 600 గజాల కమర్షియల్ ప్లాట్ స్థలం కేటాయించాలని కోరుతున్నారు. ఇవన్నీ రైతులు అభిప్రాయాలుగా రాత పూర్వకంగా తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కీలకంగా ఉన్న మంత్రులు, కలెక్టర్‌కు ఎన్నో సార్లు విన్నవించారు. అయినా వారి పిర్యాదుల్ని పరిశీలనలోకి తీసుకోలేదు. ప్రజాభిప్రాయ సేకరణలో కూడా పరిహారం ఎంత ఇస్తారనేది చెప్పలేదు. ఏకంగా రైతుల భూముల్లోకి వెళ్లి సర్వే చేయడంతో రైతులు తీవ్ర అభ్యంతరం తెలుపుతూ అడ్డుకున్నారు.

బలవంతపు సర్వే ఆపాలని కలెక్టర్‌కు వినతి

గిర్మాపూర్, పెద్దాపూర్ ఇంటర్ చేంజ్ అలైన్‌మెంట్‌ను మార్పు చేయాలని నిర్వాసిత రైతులు సోమవారం కలెక్టర్ క్రాంతి వల్లూరును కలిసి విన్నవించారు. సీపీఐఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుల తుల్జారెడ్డి ఆధ్వర్యంలో వందలాది మంది రైతులు ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిశారు. అలైన్‌మెంట్ మార్చాలని లేని పక్షంలో సర్వేను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఒకక వేళ రైతుల్ని ఒప్పించి భూముల్ని తీసుకోవాల్సి వస్తే మార్కెట్ విలువకు మూడింతలు పరిహారం, లేదంటే భూమికి భూమి ఇవ్వాలనారు. గిర్మాపూర్, పెద్దాపూర్ శివారుల్లో వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నందున నిర్వాసితులైన రైతులు ఎంత కోల్పోతే అంత ప్రభుత్వ భూమి పట్టా ఇవ్వాలని కోరారు. ఖచ్చితమైన ప్రతిపాదనలు చెప్పకుండా సర్వే చేస్తే అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు.

గిర్మాపూర్ రింగ్ రోడ్డు అలైన్మెంట్‌ను మార్చాలి

ఆర్ఆర్ఆర్‌లో బలవంతపు భూసేకరణ వెంటనే ఆపాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జయరాజు, టీజేఎస్ జిల్లా అధ్యక్షులు తుల్జారెడ్డి

కలెక్టరేట్ వద్ద ధర్నా.. కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-సంగారెడ్డి



కొండాపూర్ మండలంలోని గిర్మాపూర్, సదాశివపేట మండలంలోని పెద్దపూర్ గ్రామంలో ఆర్ఆర్ఆర్‌లో బలవంత భూసేకరణ వెంటనే ఆపాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, టీజేఎస్ జిల్లా అధ్యక్షులు తుల్జారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్ఆర్ఆర్‌లో భూములు పోతున్న రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించి కలెక్టర్ క్రాంతి వల్లూరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిర్మాపూర్ రింగ్ రోడ్డు అలైన్మెంట్‌ను వెంటనే మార్చాలని డిమాండ్ చేశారు. రైతులకు నష్టపరిహారం ఎంత ఇస్తున్నారో చెప్పకుండా అధికారులు ఇష్టానుసారంగా సర్వేలు చేయడం సరికాదన్నారు. రెండు పంటలు పండే భూములను బలవంతంగా గుంజుకుంటూ రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని విమర్శించారు. భూసేకరణ చట్టం ప్రకారం రైతుల ఇష్టం లేకుండా సర్వే ఎలా చేస్తారని ప్రశ్నించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ రేటుకు మూడింతలు అదనంగా నష్టపరిహారం చెల్లించాలన్నారు. భూమికి భూమి ఇవ్వాలని భూములు కోల్పోతున్న ప్రతీ రైతు కుటుంబానికి ఒక ప్రభుత్వ ఉద్యోగం, 600 గజాల ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. రైతుల అభిప్రాయాలను రాతపూర్వకంగా ఇచ్చిన వాటిమీద ఎలాంటి సమాధానంఅధికారులు చెప్పకుండా దౌర్జన్యంగా సర్వే చేయడం సరికాదన్నారు. తక్షణమే కలెక్టర్ చొరవ తీసుకొని నష్టపరిహారం ఎంత చెల్లిస్తున్నారో చెప్పాలన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకూ రైతులు తరఫున పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే. రాజయ్య, మాజీ సర్పంచ్ మల్లేశం, ఆంజనేయులు, జయరాం రెడ్డి, రమేష్ మహేష్, రాములు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బీడి కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- సీఐటీయూ మెదక్ జిల్లా కార్యదర్శి బసవరాజు, వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బాలమణి

నవతెలంగాణ-మెదక్ టౌన్



బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మెదక్ జిల్లా కార్యదర్శి బసవరాజు, , వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బాలమణిలు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ మెదక్ జిల్లా కమిటీ, బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 38 వేల మంది బీడీ కార్మికులు ఉన్నారని తెలిపారు. ఎక్కువ శాతం మంది బీడీలు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారన్నారు. అర్హులైన బీడీ కార్మికులకు జీవన భృతి ఇవ్వాలన్నారు. అనర్హులుగా ఉన్నవారికి బీడీలు చేయని వారికి రెండు రకాల పెన్షన్లు ఆసరా పెన్షన్, రిటైర్మెంట్ పెన్షన్ వస్తుందన్నారు. గతంలో చాలా సార్లు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకుపోయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికలప్పుడు మాత్రం వచ్చి ఓటు వేయమని అడుగుతారు తప్ప ఇప్పుడు తమ సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. గత పది సంవత్సరాల నుంచి కూడా బీడీ కార్మికుల పిల్లలకు స్కాలర్షిప్ ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. 2014 నుంచి పిఎఫ్ భృతి వస్తుంది. ఇప్పుడు పది సంవత్సరాల నుంచి కొత్తవారికి అర్హులైన వారిని ఎంపిక చేసి వారికి జీవన భృతి ఇవ్వాన్నారు. ప్రభుత్వం వెంటనే సర్వే చేసి అనర్హులైన వారిని తొలగించాలన్నారు. ఈఎస్ఐ హాస్పిటల్‌లో సరైన మందులు అందుబాటులో ఉండడం లేదన్నారు. బ్రాంచిలోకి డాక్టర్లు వచ్చి వైద్యం అందించాలన్నారు. అర్హులైన బీడీ కార్మికులకు ఎలాంటి పెన్షన్ రావడం లేదన్నారు. కావున ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బీడీ కార్మికులకు జీవన భృతి ఇవ్వాలన్నారు. అధికారులు సర్వే చేసి అర్హులను గుర్తించి, అనర్హులను తొలగించాలన్నారు. ఈఎస్ఐ హాస్పిటల్‌లో మౌలిక సదుపాయాలు. మందులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్మికుల పిల్లలకు స్కాలర్షిప్స్ ఇవ్వాలన్నారు. పిడిఎస్ఎ కార్మికులకు ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఎక్కడికక్కడ అధికారులను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. జిల్లాలోని 10 మండలాల బీడీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థిని మృతికి కారణమైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

దళిత, విద్యార్థి సంఘాల కొవ్వొత్తుల ర్యాలీ

నవతెలంగాణ-గుమ్మడిదల



ఇన్‌స్టాగ్రామ్‌లో శ్రీహరి అనే యువకుడి వేధింపులు తట్టుకోలేక తేజస్వి అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నదని..ఆమె మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు దళిత, మహిళా, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కొవ్వొత్తుల ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా మృతురాలి తల్లిదండ్రులు మాట్లాడుతూ.. తమ కూతురు లాంటి పరిస్థితి మరొక్కరికి రాకుండా.. వెంటనే శ్రీహరిని అతడి తల్లిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నిందితులపె అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, దళిత సంఘాలు, మహిళా సంఘాలు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బీబీపేట్ జెడ్పీ హైస్కూల్‌లో ఫుడ్ పాయిజన్

24 మంది విద్యార్థులకు అస్వస్థత

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



కల్హేర్ మండలంలోని బీబీపేట్ జెడ్పీ హైస్కూల్లో సోమవారం రోజున ఫుడ్ పాయిజన్ కావడంతో.. 24 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దాంతో వారిని వెంటనే ఖేడ్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే..

బీబీపేట హైస్కూల్లో 115 మంది విద్యార్థులు చదువుతున్నారు. సోమవారం రోజున మధ్యాహ్న భోజనంలో బెండకాయ చారు, గుడ్డు పెట్టారు. అయితే ఆ చారుతో పాటు.. గుడ్లు కూడా దుర్వాసన వస్తున్నాయని విద్యార్థులు ఉపాధ్యాయులకు చెప్పారు. ఈ ఒక్కరోజు తినండి అని విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచించారు. దాంతో విద్యార్థులు అదే భోజనం చేశారు. అటు పిమ్మట మూడు గంటల నుంచి విద్యార్థులకు వాంతులు రావడం జరిగింది. ఈ క్రమంలో 24 మదికి ఫుడ్ పాయిజన్ అయింది. దాంతో వెంటనే వారిని స్థానిక నారాయణఖేడ్ ఆసుపత్రికి ప్రిన్సిపల్, ఉపాధ్యాయ సిబ్బంది తీసుకొచ్చారు. అంతేకాకుండా అంతకు ముందు అంబలిలో పురుగులు వచ్చాయని విద్యార్థులు చెపారు. అప్పుడప్పుడు పలుకు అన్నం ఉంటుందని విద్యార్థులు వాపోయారు. కాగా ఇంటి నుంచి కూరలు తెచ్చుకున్న విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ కాకపోవడం గమనార్హం. విషయం తెల్సుకున్న డీఈఓ స్థానిక నారాయణఖేడ్ ఆసుపత్రిని సందర్శించి.. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా బిబిపేట్ ప్రిన్సిపల్‌ని సస్పెండ్ చేస్తున్నట్టు డీఈఓ తెలిపారు.



ఫుడ్ పాయిజన్ కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి
-ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ డిమాండ్

విద్యార్థుల అస్వస్థతకు కారణమైన అధికారులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ బాధ్యులు అక్షయ్, మహిపాల్, సతీష్‌లు డిమాండ్ చేశారు. ఫుడ్ పాయిజన్ అయిన సంగతి ఉపాధ్యాయులకు తెలిపినా పట్టించుకోలేదని.. కాబట్టి వెంటనే ప్రిన్సిపల్, ఉపాధ్యాయులపై డిమాండ్ చేశారు. అలాగే 24 మంది విద్యార్థులకు నాణ్యమైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు..

విద్యార్థులకు న్యాయమైన వైద్యాన్ని అందించండి
-ఎంపీ సురేష్ షెట్కర్

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఎంపీ సురేష్ షెట్కర్ పరామర్శించారు. విద్యార్థుల బాగోగులను తెలుసుకొని నాణ్యమైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి తెలిపారు..

విద్యార్థులకు ఉపాధ్యాయ సంఘాలు పరామర్శ..

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 24 మంది విద్యార్థులను యూటీఎఫ్, టీపీటీఎఫ్ ఇతర సంఘాలు నాయకులు వచ్చి పరామర్శించారు.

సమస్యల పరిష్కారానికి రూ.250 కోట్లు కేటాయించాలి



సీపీఐ(ఎం) ఏరియా కమిటీ కార్యదర్శి బి.రామచందర్
పార్టీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయ ముట్టడి

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని సమస్యల పరిష్కారానికి రూ.250 కోట్లు తక్షణమే కేటాయించాలని సీపీఐ(ఎం) ఏరియా కమిటీ కార్యదర్శి బి.రామచందర్ డిమాండ్ చేశారు. పేదలకు, కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, వర్కర్స్ కాలనీ ఏర్పాటు చేయాలని, రోడ్స్, మురికి కాలువలు నిర్మించాలని, జహీరాబాద్ పట్టణ ప్రజల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా రామచందర్ మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలో చేపట్టిన బస్తీబాటలో ఎన్నో సమస్యలు తమ దృష్టికి వచ్చాయని వాటన్నింటినీ వెంటనే పరిష్కరించాలన్నారు. జహీరాబాద్ పట్టణ పేదలకు, కార్మికులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, పట్టణంలో రోడ్లు, మురికి కాలువలు నిర్మించాలని, ప్రత్యేకించి జహీరాబాద్ పట్టణ అభివృద్ధికి తక్షణ సాయంగా రూ.250 కోట్లు కేటాయించాలని, మున్సిపల్‌లో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. జహీరాబాద్ పట్టణ పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించడంలో, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు కేటాయించిన సందర్భంగా కూడా అర్హులకు ఇవ్వకుండా అనర్హులకు ఇచ్చి పేదలకు అన్యాయం చేశారన్నారు. వెంటనే సమస్యలన్నింటినీ పరిష్కరించాలన్నారు. సీపీఐ(ఎం) జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యులు ఎస్ మహిపాల్ మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలు బస్తీబాట సందర్భంగా తమ దృష్టికి వచ్చాయన్నారు. కనీసం పెన్షన్, రేషన్ కార్డు సమస్యలు కూడా పరిష్కరించడం లేదన్నారు. వెంటనే వాటిని పరిష్కరించాలన్నారు. అలాగే ప్రభుత్వం ప్రకటించిన విధంగా స్థలం ఉన్న వారికి ఐదు లక్షల సాయాన్ని వెంటనే అందజేయాలన్నారు. కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల సాయం అందజేసి.. వర్కర్స్ కాలనీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రెండు గంటలపాటు ఈ ముట్టడి జరగడంతో.. ఆర్డీవో స్పందించి బయటకు వచ్చి సమస్యలను విన్నారు. మున్సిపల్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి అధికారుల పరిధిలో ఉన్న సమస్యలను త్వరలో మీటింగ్ ఏర్పాటు చేసి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దాంతో వారు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులతో పాటు వివిధ వార్డులకు చెందిన నిరుపేదలు, బాధితులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సంగారెడ్డి

మంగళవారం | 13 ఆగస్టు 2024 | www.navatelangana.com

మాన్‌కాల్ బంకెట్ హాల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే



నవతెలంగాణ-జహీరాబాద్

మాజీ మున్సిపల్ చైర్మెన్ మహంకాల్ సుభాష్ గుప్తా ఆయన తనయుడు, ప్రముఖ వ్యాపారవేత్త మహంకాల్ తిరుమల్ గుప్తా నూతనంగా నిర్మించిన మాన్‌కాల్ బంకట హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేద మధ్యతరగతి ప్రజలకు అనువైన విధంగా అద్దెలను నిర్వహిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రాజకీయంతో పాటు వ్యాపార రంగంలో కూడా మహంకాల్ శుభాష్ తనకంటూ ముద్ర వేసుకున్నాడన్నారు. అనంతరం మహంకాళి తిరుమల్ ఎమ్మెల్యే మాణిక్యరావును పూలమాల శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్, ఉజ్వల రెడ్డి విజయ్ కుమార్, నామారవికిరణ్ గుప్తా, వైద్యనాథ్, గుండప్పయాదవ్, తట్టు నారాయ ణ యాదవ్, మురళీకృష్ణ గౌడ్, మహమ్మద్ ఖాజా, మహమ్మద్ లుక్మాన్, జేజే జావీద్, ముజాహిద్, మోయిాస్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-కంగ్టి

మండలంలోని అయా గ్రామాల పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీవో సత్తయ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నారాయణఖేడ్ డివిజన్ కన్వీనర్ నల్లవల్లి రమేష్ మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రావాల్సిన కాస్మోటిక్, సబ్బులు నూనెలు బెల్లం లాంటివి కొన్ని రోజుల నుంచి అందడం లేదన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించడంతోపాటు.. అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సతీష్, వివిధ గ్రామపంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వట్‌పల్లి ప్రజావాణి వెలవెల..



నవతెలంగాణ-వట్‌పల్లి

ప్రజా సమస్యల పరిష్కారానికి వట్‌పల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి.. దరఖాస్తుదారులు లేక వెలవెలబోతోంది. ఇప్పటికీ మూడుసార్లు ప్రజావాణి నిర్వహించగా.. మొదటి వారం ఒక్క దరఖాస్తు కూడా అందలేదు. రెండోవారం, మూడో వారం ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు అందాయి. సోమవారం జరిగిన మూడో వారం ప్రజావాణిలో వృద్ధ పింఛన్ మంజూరు చేయించాలని దరఖాస్తు చేశారు. కాగా గ్రామస్థాయిలో ప్రజావాణిపై అవగాహన లేకపోవడంతో దరఖాస్తులు అందట్లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్, వట్‌పల్లి పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఐకేపీ ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయానికి రూ.90,016 విరాళం



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ శ్రీ శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి.. మెదక్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన లక్ష్మి నారాయణ చారి 90 వేల పదహారు రూపాయలు విరాళం అందజేశారు. కమిటి సభ్యులు లక్ష్మి నారాయణ చారి కుటుంబానికి ఎల్ల వేళలా బ్రహ్మంగారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షిస్తూ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం..



నవతెలంగాణ-కొండాపూర్

మండలంలోని మాచేపల్లి గ్రామంలో సీసీరోడ్డు పనులను సంగారెడ్డి ఆత్మ కమిటీ చైర్మెన్ ప్రభు, సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మెన్ కుమార్, నరసింహారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కిషన్ నాయక్ గ్రామస్తులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆత్మ కమిటీ చైర్మెన్ ప్రభు మాట్లాడుతూ.. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద రూ.8 లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభించినట్టు చెప్పారు. సీసీరోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

వెంకట్రావు మక్త తాండకు రోడ్డు వేయండి



నవతెలంగాణ-కంది

కంది గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకట్రావు మక్త తాండాలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రోడ్డు కోతకు గురైంది. దాంతో స్కూల్ విద్యార్థులు, గ్రామ ప్రజలు సోమవారం రోజున తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డు మొత్తం పూర్తిగా దెబ్బతిని నీటితో నిండడంతో.. ఓ చెరువును తలపిస్తున్నదని స్థానికులు చెబుతున్నారు. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నదని.. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని రోడ్డు వేయాలని కోరుతున్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు ఆరోగ్య శిబిరం



నవతెలంగాణ-సంగారెడ్డి

సహారా ఇంక్లుసివ్ హాస్పిటల్ సంగారెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌కు సోమవారం ఆరోగ్య శిబిరాన్ని రిటైర్డ్ ఉద్యోగుల భవన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సహారా ఇంక్లుసివ్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ శంకర్ మఠం మాట్లాడుతూ.. ఉచిత వైద్యంతో పాటు మందులు పంపిణీ చేశారు. సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేక సదుపాయాలు, అన్ని రకాల వైద్య సేవలు ఆసుపత్రిలో అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో న్యూరాలజిస్ట్ డాక్టర్ ధీమంత్ రెడ్డి, న్యూరో ఫిజిషియన్ డాక్టర్ దీమంత్, డీఎంఓ డాక్టర్ ప్రతిభ, సీనియర్ సిటిజన్స్ తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో వికలాంగులకు అవకాశం కల్పించాలి



నవతెలంగాణ-వట్‌పల్లి

రాష్ట్రంలో త్వరలో నామినేటెడ్ పోస్టులను భర్తి చేసేందుకు ప్రభుత్వం రూపకల్పన చేస్తున్నదని.. కాబట్టి నామినేటెడ్ పోస్టుల్లో వికలాంగులకు అవకాశం కల్పించాలని అందోల్ డివిజన్ వికలాంగుల అధ్యక్షులు సుభాష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి పాండర్‌కి సోమవారం వికలాంగులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు వికలాంగులను అన్ని విధాలు ఆదుకుంటామని.. రిజర్వేషన్ పద్ధతిన రాజకీయపరంగా అభివృద్ధి పరుస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట వట్టిపల్లి మండల వికలాంగుల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

సమగ్ర శిక్షణా ఉద్యోగుల నిరసన



నవతెలంగాణ-న్యాల్‌కల్

విద్యాశాఖ సమగ్ర శిక్షణా ఉద్యోగుల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మండల వనరుల కేంద్రంలో ఆ ఉద్యోగులు సోమవారం నిరసన తెలిపారు. సమగ్ర శిక్షణా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి.. చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని.. పే స్కేల్, జీవిత బీమా రూ.5 లక్షలు ఇవ్వాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. సమగ్ర శిక్షణా సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని జేఏసీ అధ్యక్షుడు రవి హెచ్చరించారు. ఈ నిరసనలో కార్యదర్శి మాధవి, సీఆర్పీ కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-జహీరాబాద్

కొబ్బరిచెట్టు ఎక్కి కాయలు తెంపుతుండగా ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన జహీరాబాద్ పట్టణంలో సోమవారం జరిగింది. ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్టెం దశరథ్(32) అనే వ్యక్తి బాగారెడ్డిపల్లి జహీరాబాద్ శ్రీరామ్ మొహల్లా జహీరాబాద్ గాదరాజు ఇంట్లో కొబ్బరి చెట్టు ఎక్కి కాయలు తెంపుతుండగా ప్రమాదవశాత్తు చెట్టు పై నుంచి కిందపడ్డాడు. బలమైన గాయాలు కావడంతో జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య అగు చిట్టెం రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

శ్రావణమాసంతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-న్యాల్‌కల్

శ్రావణమాసాన్ని పురస్క రించుకుని మండల పరిధిలోని రేజిం తల్ సిద్ధి వినాయక, రాఘవపూర్ పంచ వటి క్షేత్రంతో పాటు పలు ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. దాంతో ఉదయం నుంచే ఆలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. టేకుర్ మల్లికార్జున ఆలయంలో భక్తులు నిత్య అభిషేకాన్ని నిర్వహించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రజలు సుఖ సంతోషా ఉండాలని వేడుకున్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

- ఏర్పాట్లు ఘనంగా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

నవతెలంగాణ-సంగారెడ్డి

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15న సంగారెడ్డి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించబోయే భారతస్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సోమవారం నాడు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులతో సమావేశమం నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. పోలీస్ గౌరవ వందన స్వీకరణ, బందోబస్తు ఏర్పాట్లను నిర్వహించాలని, స్టేజ్, సీటింగ్, పీఏ సిస్టమ్, తాగునీరు, పారిశుధ్య చర్యలు చేపట్టాలని, గౌరవ ముఖ్య అతిథి ప్రసంగం రూపొందించాలని, పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, ఎన్‌సీసీ క్యాడెట్ మార్చ్ ఫాస్ట్ ఏర్పాట్లు, గ్రౌండ్‌లో మెడికల్ టీమ్‌తో ఎమర్జెన్సీ సేవలు, నిరంతరాయ విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉత్తమ సేవలందించే ఉద్యోగులను గుర్తించి ఉత్తమ సేవా ప్రశంసా పత్రాల కోసం ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరు గ్యారెంటీల పథకాలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను తెలియచేసే శకటాల ఏర్పాట్లు, స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించాలని ఆదేశించారు. జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు నిర్వహించే ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ నిబంధనలను జిల్లా అధికారులు ఖచ్చితంగా పాటించాలని ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్ఓ పద్మజ రాణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పరమేశ్వర్, పోలీసు,జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి..



ప్రజావాణి అర్జీలను ప్రత్యేక దృష్టితో సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. సోమవారం జరిగిన ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన 86 అర్జీలను స్వీకరించారు. అందులో రెవి న్యూ శాఖ 56, సర్వేల్యాండ్ రికార్డు 02, డీఆర్‌డీఓ 04, ఎంప్లాయిమెంట్, వ్యవసాయ శాఖ 09, మిషన్ భగీరథ 01, పంచాయతీ రాజ్ 03, మున్సిపాల్టీ 6, శిశు సంక్షేమ శాఖ, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యశాఖ 01, పోలీస్ శాఖ 03, యువజన సంక్షేమ శాఖ 01 చొప్పున ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, రెవిన్యూ అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి బాలశౌరి, జిల్లా వైద్యాధికారిణి గాయత్రి, పీడీఆర్ డీఏ జ్యోతి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, సంబంధిత జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బాధితురాలికి ఎల్‌ఓసీ అందజేత

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని 2వ వార్డుకి చెందిన జె.ఈరమ్మకి మెదడు సమస్య రావడంతో ఆసుపత్రిలో చేరారు. చికిత్స నిమిత్తం రూ.2 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. బాధితురాలికి ఆర్థిక స్థోమత సరిగా లేకపోవడంతో తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మెన్ యన్.గిరిధర్ రెడ్డిని సంప్రదించారు. దాంతో ఆయన వెంటనే స్పందించి.. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రోడ్లు మరియు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.2 లక్షల ఎల్‌ఓసీని బాధితురాలి కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరియు యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మధురనగర్ కాలనీలో త్రీ ఫేస్ కరెంటు ఇవ్వాలి

- అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని 18వ వార్డు గ్యాస్ గోదాం వద్దగల మధురనగర్ కాలనీలో త్రీఫేస్ కరెంట్ ఇవ్వాలని ఆ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ అశ్విన్, కాలనీ ప్రెసిడెంట్ సామల మురళి మాట్లాడుతూ.. గత 20ఏండ్లుగా ఈ కాలనీలో నివాసం ఉంటున్నామని, సుమారు 150 సర్వీస్ కనెక్షన్స్ ఉన్నాయన్నారు. కానీ కాలనీలో మాత్రం త్రీఫేస్ కరెంటు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సింగిల్ ఫేస్ కరెంటు ఉండడం.. అది కూడా వచ్చి పోతుండడంతో బోరు మోటార్స్, టీవీ, ఫ్యాన్స్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు కరెంటు పోవడం వల్ల విద్యార్థులు, ఉద్యోగస్తులు సమయానికి వెళ్లలేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. అలాగే రోడ్డు మధ్యలో ఉన్న కరెంట్ స్థంభాన్ని కూడా తొలగించాలని కోరారు. వెంటనే త్రీఫేస్ కరెంట్ అందించి కాలనీ కరెంటు సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ కార్యదర్శి నరేందర్ గౌడ్, కాలనీ పెద్దలు అర్జునయ్య, గోవర్ధన్, భూపాల్, రెడ్డి, బాలేష్, బాల్రాజ్, ప్రసాద్, పీరయ్య, చిరంజీవి, శేఖర్,సుదర్శన్, రణదీప్, అశోక్, అఖిల్, అర్జున్‌పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ నాలుగు మండలాలు, రెండు మున్సిపాల్టీలకు సంబంధించిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొత్తం 163 మంది లబ్ధిదారులకు రూ.54,61,500 విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసినట్టు చెప్పారు. సదాశివపేట పట్టణానికి చెందిన 17మంది లబ్ధిదారులకు రూ.635500, సదాశివపేట మండలంలో 44 మంది లబ్దిదా రులకు రూ.15,67,500, కొండాపూర్ మండలంలో 40 మంది లబ్దిదారులకు రూ.12,30,000, కంది మండలంలో 15 మంది లబ్దిదారులకు రూ.5,62,500, సంగారెడ్డి పట్టణానికి చెందిన 21 మంది లబ్దిదారులకు రూ.7,01,000, సంగారెడ్డి మండలంలో 15మంది లబ్దిదారులకు రూ.4,19,500, ఇతర నియోజకవర్గ 11మంది లబ్దిదారులకు రూ.3,45,500 చెక్కులను అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మెన్, కాసాల బుచ్చిరెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ నరహరి రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శివరాజ్ పాటిల్, సదాశివపేట మున్సిపల్ వైస్ చైర్మెన్ చింత గోపాల్, మాజీ జడ్పిటిసి కొండల్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదమ్మ కిష్టయ్య, పట్టణాధ్యక్షులువెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింలు, పార్టీ మండలాధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, చక్రపాణి, విఠల్, అంజనేయులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు రక్షణ కరువు

- కార్మికులపై దాడి చేసిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి
- సీఐటీయూ ఆధ్వరంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-సంగారెడ్డి

మున్సిపల్ కార్మికుల పట్ల దురుసుగా ప్రవర్తించి.. కార్మికులపై దాడి చేసిన వారి మీద క్రిమినల్ కేసు నమోదు చేయాలని.. కార్మికులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూసీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. అంతకు ముందు గాయపడిన కార్మికులను ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు. ధర్నా సందర్భంగా సీఐటీయూ జిల్లా మాజీ కార్యదర్శి మాణిక్యం, సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి మాట్లాడుతూ.. సంగారెడ్డి గ్రేడ్ వన్ మున్సిపల్‌లో కాంట్రాక్ట్ కార్మికులు రాత్రి సమయాల్లో పనిచేస్తుండగా.. అనిల్, సునీల్ అనే ఇద్దరు వ్యక్తులు అక్కడ చెత్త వేస్తుండగా.. అక్కడ వేయొద్దని కార్మికులు చెప్పారన్నారు. దాంతో కార్మికులతో వారు వాగ్వివాదానికి దిగారన్నారు. కార్మికుల పట్ల దురుసుగా ప్రవర్తించి.. దాడి సైతం చేశారన్నారు. ఇంత జరిగినా జిల్లా అధికారులు పట్టించుకోకపోవడం చాలా దారుణమన్నారు. కార్మికులు పనిచేయాలంటేనే భయపడుతున్న పరిస్థితి నెలకొన్నదన్నారు. దాడికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వ డిమాండ్ చేశారు. లేని యెడల పోరాటం తప్పదని హెచ్చరించారు. కాగా వినతిపత్రం ఇచ్చిన సందర్భంగా..దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేస్తామని అడిషనల్ కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సువర్ణ రాజు నర్సింలు, లక్ష్మణ్ జనార్ధన్ యాదయ్య సంగీత లక్ష్మీ ప్రభు లక్ష్మీనారాయణ యాదగిరి, మల్లేశం, సునీత, అనిత, సంగీత తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి ఓ వరం





నవతెలంగాణ-జహీరాబాద్

ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఓ వరం లాంటిదని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. మొగుడంపల్లి మండలానికి చెందిన 14 మంది లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను క్యాంపు కార్యాలయంలో డీసీఎంఎస్ చైర్మెన్ మల్కాపురం శివకుమార్‌తో కలసి ఎమ్మె ల్యే పంపిణీ చేశారు. 14మంది లబ్ధిదారులకు గాను రూ.3 లక్షల 7000 విలువ గల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావుకు, డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్‌లకు లబ్దిదారులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రవీందర్, పార్టీ మాజీ మండల అధ్యక్షులు నర్సింహ రెడ్డి, యువ నాయకులు ప్రవీణ్ పాటిల్, శ్రీకాంత్ రెడ్డి, భీమ్‌రెడ్డి, శబిర్ ఖాన్, నర్సింహ రెడ్డి, స్వామిదాస్, రవి, సంగారెడ్డి, శివరాజ్, అశోక్ పాటిల్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్ : హద్నూర్ గ్రామానికి చెందిన నరసింహారెడ్డికి రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే మాణిక్ రావు, డీసీఎంఎస్ చైర్మెన్ మల్కాపురం శివకుమార్‌లు అందజేశారు. చెక్కు రావడం పట్ల లబ్దిదారుడు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, హద్నూర్ ప్రవీణ్, షబ్బీర్ ఖాన్, సుభాష్ సేట్ తదితరులు ఉన్నారు.

వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యం వీడాలి

- రైతులకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.నర్సిములు



నవతెలంగాణ-కంది

మండల వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండకపోవడంతో రైతులు వ్యవసాయ కార్యాలయం చుట్టూ గత వారం రోజులుగా చెప్పులు అరిగేలా తిరుగుతున్నారని.. సదరు అధికారులు నిర్లక్ష్యం వీడి రైతుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.నర్సిములు డిమాండ్ చేశారు. సోమవారం రోజున దాదాపు ఆరు గ్రామాల రైతులు ఉదయం పది గంటల నుంచి దాదాపుగా రెండు గంటలు ఆఫీస్ వద్ద అధికారుల కోసం ఎదురుచూసినా.. ఏ ఒక్కరు కూడా రాలేదన్నారు. దాంతో ఆ రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. అధికారులు వ్యవసాయ కార్యాలయానికి రాకుండా పర్యటనల్లో ఉన్నామని చెప్పడం సరికాదన్నారు. బ్యాంకు రుణమాఫీ, ఇతర ఏమైనా సమస్యలు ఉంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని ప్రభుత్వం చెబుతుంటే.. అధికారులు మాత్రం రైతులకు అందుబాటులో ఉండడం లేదన్నారు. పొలం పనులు వదులుకుని కార్యాలయాల చుట్టూ తిరుగు తున్నా.. అధికారులు మాత్రం దొరకడం లేదన్నారు. దాంతో అటు ఆ పనులు ఆగిపోయి.. ఇటు వచ్చిన పని కాకపోవడంతో రైతులు నైరాశ్యంలోకి వెళ్తున్నారన్నారు. కాబట్టి ఉదయం నుండి సాయంత్రం వరకు ఆఫీస్‌లో ఎవరో ఒక అధికారి ఉండేలా పై అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాశీపూర్,చర్యాల్, ఉత్తరపల్లి, కంది, ఇంద్రకరణ్, జుల్కల్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి



నవతెలంగాణ-అమీన్‌పూర్

కాలనీలలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండు రంగారెడ్డి అధికారులను ఆదేశించారు. అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని నరేంద్రకాలనీలో రహదారులను, పీఎస్ఆర్ కాలనీ, సాయి అంబికా కాలనీల్లో చేపడుతున్న మంచినీటి పైపులైన్లు, పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని సూచించారు. మున్సిపల్ పరిధిలోని ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు అయినప్పుడే వాటికి సార్ధకత చేకూరుతుందని అన్నారు. మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, హెచ్ఎండబ్ల్యూఎస్ డీజీఎం చంద్రశేఖర్, కౌన్సిలర్ కృష్ణ, అమీన్పూర్ మున్సిపల్ ఏఈ ప్రవీణ్,కో అప్షన్ సభ్యులు తలారి రాములు, సీనియర్ నాయకులు కొల్లూరు యాదగిరి,కాలనీ వాసులు,తదితరులు పాల్గొన్నారు.

షుగర్ వ్యాధి ఉచిత పరీక్షలకు భారీ స్పందన



నవతెలంగాణ-వట్‌పల్లి

మండల కేంద్రంలోని సద్గురు ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ సెక్రటరీ డాక్టర్ అనంతరెడ్డి డయాబెటిక్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మొహినోదిన్ అధ్యక్షతన షుగర్ వ్యాధికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు, ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు షుగర్ వ్యాధి పరీక్షలను చేశారు, ఈ కార్యక్రమంలోడక్టర్ వైద్య సాగర్ ,డిస్ట్రిక్ క్యాబినెట్ మెంబర్ పెద్దన్న, కిషన్ రావు, మారుతి, పాండు, మధు, తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడద తొలగించాలి





నవతెలంగాణ-కోహిర్

మండలంలోని కోహిర్ పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. కుక్కలు గుంపులుగా ఏర్పడి చిన్న పిల్లలపై దాడులు చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఫయాజ్ నమారి అనే విద్యార్థినిపై కుక్కలు గుంపులుగా దాడి చేసి.. ఆ విద్యార్థిని మోకాళ్ళ మీద, అరచేతులను గాయపరిచాయన్నారు. పాఠశాల చుట్టుపక్కల వార్డుల్లో కుక్కల బెడద అధికంగా ఉన్నదని వారు వాపోతున్నారు. దాంతో పిల్లలను బడికి పంపాలంటే తల్లిదండ్రులు భయాందోలనకు గురవుతున్నారన్నారు. కాబట్టి ఇప్పటికైనా అధికా రులు స్పందించి.. కుక్కల బెడద తొలగించాలని కోరుతున్నారు.



మద్యం తాగి వాహనాలు నడపరాదు

నవతెలంగాణ-జోగిపేట

మద్యం తాగి వాహనాలను నడపొద్దని జోగిపేట ఎస్సై పాండు సూచించారు. సోమవారం సాయంత్రం స్థానిక బసవేశ్వర విగ్రహం వద్ద జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. వాహనాదారులు ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల ధ్రువపత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. పలు వాహనాలపై జరిమాణాలు విధించారు. ఈ కార్యక్రమంలో పుల్కల్, వట్పల్లి ఎస్సైలు క్రాంతి, లక్ష్మణ్, ఏఎస్ఐ అంజయ్య, విట్టల్, పోలీస్ సిబ్బంది ధర్మేందర్, సంజీవ్, శ్రీశైలం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం అందజేసిన ఉపాధ్యాయుడు



నవతెలంగాణ-చేగుంట

మండల స్టేషన్ రోడ్‌లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మేడిపల్లి చక్రధర్ పదోన్నతిపై వెళుతూ పాఠశాల విద్యార్థులకు సోమవారం సౌండ్ సిస్టంను అందజేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు మేడిపల్లి చక్రధర్‌ను శాలువాతో సన్మానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఆరు సంవత్సరాల నుంచి పనిచేసి, పదోన్నతిపై వెళ్లిన మేడిపల్లి చక్రధర్ మాసాయిపేట వాస్తవ్యులు కావడం సంతోషకరమన్నారు. పాఠశాలకు సౌండ్ సిస్టం అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉపాధ్యాయుడు అందించిన సౌండ్ సిస్టం పాఠశాలలో జరిగే వివిధ కార్యక్రమాలకు చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రఘుపతి, రాజేశ్వర్, సుధాకర్ రెడ్డి, లక్ష్మణ్, వెంకటేష్, మనోహర్, సురేందర్, రాధా, భవాని, శ్రీ వాణి, సరస్వతి, రమ, రమాదేవి, ఉమాదేవి, శారద, శృతి, సత్యనారాయణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

15వ వార్డులో వైద్య శిబిరం



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో అంగన్వాడి ఏడవ కేంద్రంలో పీహెచ్‌సీ వైద్య బృందం ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో బీపి , షుగర్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో సీజనల్ సీజనల్ వ్యాధులు సోకకుండా అన్ని వార్డులలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందిస్తామని పీహెచ్‌సి వైద్యులు తెలిపారు. ఈ శిబిరంలో ఆశా వర్కర్లు అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ మారణ హోమానికి నిరసనగా కుకునూర్ పల్లిలో బంద్



నవతెలంగాణ-కొండపాక

బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న మారణ హోమానికి నిరసనగా కుకునూరుపల్లి మండల కేంద్రంలో సోమవారం బంద్ నిర్వహించారు. హిందూ సంఘాలు , చత్రపతి శివాజీ యూత్ బజరంగ్ దళ్ సంయుక్తంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి వ్యాపార సంస్థలని మూసి వేయించారు. వ్యాపారస్తులతో పాటు పార్టీలకతీతంగా పలువురు స్వచ్ఛందంగా బందులో పాల్గొన్నారు.

సిద్దిపేట పట్టణంలో 13న స్వచ్ఛంద బంద్



నవతెలంగాణ-సిద్దిపేట

బంగ్లాదేశ్‌లో నెల కొన్ని హింసాత్మక పరిస్థితులు, జరుగుతున్న నర మేధాన్ని ఖండిస్తూ 13న సిద్దిపేటలో స్వచ్ఛందంగా బంద్ పాటించాలని సిద్దిపేట హిందూ ఐక్యవేదిక సభ్యులు రాజు, సత్యం, రాజారాంలు కోరారు. సోమవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో వారు మాట్లాడుతూ నిరసనలో భాగంగా స్వచ్ఛంద బంద్, నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు వెంకటేశ్వర దేవాలయం నుంచి శాంతి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా టై బెల్టు, బ్యాడ్జీలు పంపిణీ

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్



గజ్వేల్ మండల పరిధిలోని కొడకండ్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా టై, బెల్టు, బ్యాడ్జిలను గ్రామానికి చెందిన దూలం బాలమ్మ ఐలయ్య గౌడ్ జ్ఞాపకార్థం వారి కుమారుడు నరసింహులు గౌడ్ అందజేశారు. సోమవారం ప్రధానోపాధ్యాయులు మధునాల శ్రీనివాస్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మధునాల శ్రీనివాస్ మాట్లాడుతూ బాల్య మిత్రులు దూలం నర్సింలు గౌడ్ తల్లిదండ్రులు బాలమ్మ ఐలయ్య గౌడ్ జ్ఞాపకార్థంగా 70 మంది విద్యార్థులకు గాను ఉచితంగా పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. ముందు విద్యార్థులకు ఏమైనా అవసరాలు ఉంటే కూడా చెప్పండని, మిత్ర బృందం ద్వారా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అంతేకాకుండా బాలమ్మ ఐలయ్య గౌడ్‌ల ఆశీస్సులు ఎల్లవేళలా విద్యార్థులపై ఉండాలని తెలిపారు. విద్యార్థులకు టై, బ్యాడ్జీ, బెల్టులు పంపిణీ చేయడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రహేలా, కల్పన,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న టీచర్లకు సన్మానం

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలం రామవరం గ్రామంలో బదిలీపై వెళ్తున్నటువంటి చంద్రారెడ్డి, వీర ప్రకాష్, తిరుపతి ముగ్గురు టీచర్లకు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు, గ్రామస్తులు కలిసి సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి శాలువా కప్పి వారితో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడికతో ముందుకు వెళ్లాలని అన్నారు. టెన్త్ క్లాస్ విద్యార్థులు మంచి పాయింట్స్‌తో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లింగాల శైలజా రెడ్డి, ఏఎంసీ చైర్మెన్ రాధిక, మాజీ ఎంపీటీసీ వనపర్తి నరేష్, లింగాల శ్రీనివాస్, రవితేజ, సంజీవ్, వంశీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో సయ్యద్ మతిన్‌కు ఘన సన్మానం

నవ తెలంగాణ -గజ్వేల్



గజ్వేల్ మజీద్ కమిటీ నూతన అధ్యక్షుడిగా భారీ మెజార్టీతో గెలుపొందిన సయ్యద్ మతీన్‌ను సోమవారం వారి కార్యాలయంలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపి ఘన సన్మానం నిర్వహించారు. సోమవారం ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ స్నేహ అధ్యక్షులు మల్లేశం గౌడ్, నాచారం దేవస్థానం మాజీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ సయ్యద్ మతిన్ మజీద్ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికవ్వడం ఆనందదాయకమని, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షుడిగా గతంలో విశేష సేవలు అందించారని సమాజ సేవలో ముందు వరుసలో ఉన్న సయ్యద్ మతిన్ మజీద్ కమిటీ అధ్యక్షుడిగా మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ వైస్ చైర్మెన్ జకియుద్దిన్, అజార్, ఆర్యవైశ్య సీనియర్ నాయకులు దొంతుల సత్యనారాయణ, నాగేంద్రం, రవి తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ బంద్ విజయవంతం చేయాలి

- బీజేపీ నేత దారం గురువారెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్




గజ్వేల్ బంద్ విజయవంతం చేయాలని బీజేపీ నేత దారం గురువారెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్ బీజేపీ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన దారం గురవారెడ్డి మాట్లాడుతూ బంగ్లాదేశ్ లో హిందువులపై దాడికి నిరసనగా, బంగ్లాదేశ్‌లోని హిందువులకు మద్దతుగా గజ్వేల్‌లో మంగళవారం నిర్వహిస్తున్న హిందూ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. హైందవ సోదరులు, హిందూ సంఘాల, ఆధ్వర్యంలో తలపెట్టిన గజ్వేల్ బంద్ విజయవంతం చేసి, హిందువుల ఐక్యత చాటాలని కోరారు. ఈ బంద్‌కు విద్యాసంస్థలు, కాలేజీలు, బీజేపీకి పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుడిక్యాల రాములు, మనోహర్ యాదవ్, సందీప్, రోహిత్, నాగేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకుడి మృతి

- నివాళులర్పించిన సీపీఐ నాయకులు

నవతెలంగాణ-బెజ్జంకి



మండల కేంద్రానికి చెందిన ఏఐఎస్ఎఫ్ మాజీ మండల కార్యదర్శి తాడిచెట్టు రాకెశ్ అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ మృతదేహానికి పూలమాల వేసి స్థానిక సీపీఐ నాయకులతో కలిసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా, మండల నాయకులు హజరయ్యారు.

పంటల బీమాపై స్పష్టత కరువు

- మార్గదర్శకాలు విడుదల చేయని ప్రభుత్వం
- అయోమయంలో అన్నదాతలు

నవతెలంగాణ-పెద్దశంకరంపేట్

ప్రతికూల పరిస్థితుల్లో పంటలు దెబ్బతింటే అన్నదాతకు అండగా ఉండటం కోసం ఫసల్ బీమా యోజన అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఇప్పటి వరకు మార్గదర్శకాలు విడుదల చేయలేదు. దీంతో ఈ సీజన్లో బీమా ఉంటుందా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం 100% ప్రీమియం చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. కానీ వరి మొక్కజొన్న పెసర పంటల సాగు పూర్తయింది. మండలంలో వరి నాట్లు కూడా పూర్తయ్యాయి. ఐదేళ్లుగా రాష్ట్రంలో పసల్ బీమా అమలుకు నోచుకోలేక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వడగండ్లు, వర్షాలు, వరదలు, ఈదురు గాలులుకు పంటలకు నీరు అందక నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందలేదు. గతంలో కేంద్రం 40 శాతం రాష్ట్రం ప్రభుత్వం 40 శాతం రైతులు 20 శాతం ప్రీమియం చెల్లించేవారు. తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకంలో నుంచి బయటకు వచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీమా అవశ్యకతను గుర్తించి పథకాన్ని పునరుద్ధించాలని నిర్ణయించింది. కానీ మార్గదర్శకాలు విడుదల చేయలేదు. దీంతో అన్ని పంటలకు వర్తిస్తుందా, పంట వివరాలు నమోదు ఆధారంగా వర్తింప చేస్తారా అనే సంశయం రైతుల్లో నెలకొంది.



భరోసా కల్పించాలి.

పరిగెప్ప గారి బీతయ్య సంగారెడ్డి పేట్



రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమా అమలు చేస్తామని చెప్పడం హర్షణీయం. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలి. ఈ పథకం మార్గదర్శకాలు విడుదల చేసి ఈ సీజన్ నుంచే అమలు చేయాలి.

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు

యాదయ్య, మండల వ్యవసాయ అధికారి



ఇటీవల నిర్వహించిన సమావేశంలో పంటల బీమా ప్రత్యేక చర్చకు వచ్చింది. ఇప్పటి వరకు ఫసల్ బీమా మార్గదర్శకాలు విడుదల కాలేవు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపడతామన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- నర్సాపూర్ డిప్యూటీ డిఎంహెచ్ ఓ డాక్టర్ సృజన

నవతెలంగాణ-కొల్చారం

సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా అంటువ్యాధులు ప్రబల కుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నర్సాపూర్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సృజన అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్చారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించిన ఆమె ఆరోగ్య కేంద్రంలోని స్టోర్ రూమ్, ల్యాబ్ రూం, డెలివరీ రూం, వార్డును తనిఖీ చేసి రికార్డులను పరిశీలించినారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి వ్యాదుల నివారణ చర్యల గురించి పలురకాల సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆసుపత్రులకు వచ్చే రోగుల వివరాలు రిజిష్టర్‌లో నమోదు చేసి రోజు వివరాలను జిల్లా కార్యాలయంలో సమర్పించాలన్నారు. డెంగ్యూపై తీసుకుంటున్న ప్రత్యేక చర్యలపై ప్రజలకు వివరించాలన్నారు. ఎక్కడైనా సీజనల్ డిసీజ్ వస్తే తొందరగా



ఆ గ్రామానికి వెళ్లి క్యాంపును ఏర్పాటు చేయగలగాలని ఆదేశించారు. అలాగే ఎన్సిడి ప్రోగ్రాంలో డయాబెటిక్, బిపి పేషెంట్లకు అందరికీ సకాలంలో మందులు అందేవిధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రమేష్, సిబ్బంది మదన్మోహన్, ఏసు మని తదితరులు ఉన్నారు.

శాంతి భద్రతలను కాపాడమే జిల్లా పోలీసుల లక్ష్యం

- అర్జిదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్‌పి

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్



మెదక్ జిల్లాలో శాంతి పద్ధతులను కాపాడమే జిల్లా పోలీసుల లక్ష్యమని జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జిదారుల నుంచి జిల్లా ఎస్‌పీ ఉదయ్‌కుమార్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులను ఆదేశించారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుని, వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకోవాలన్నారు. పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా ఎస్‌పి డి.ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రజా సమస్యలపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నామని తెలిపారు.

ఎప్పుడు చూసినా డోర్‌కు తాళమే

- వచ్చేది ఎప్పుడో? పోయేది ఎప్పుడో ?
- సమయపాలన పాటించని హాస్టల్ వార్డెన్



నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల కోసం వసతి గృహాలను ఏర్పాటు చేసి వార్డెన్లను నియమించింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వార్డెన్లు హాస్టల్ ఉన్నచోటనే ఉండాలి దానికి విరుద్ధంగా సొంత ఊర్లలో ఉంటూ హాస్టల్‌కు సమయానికి రావడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజాంపేట మండల కేంద్రంలోని షెడ్యూల్ కులాల వసతి గృహంలో పనిచేస్తున్న వార్డెన్ ఎప్పుడు వస్తాడో ఎప్పుడు పోతాడో తెలియని పరిస్థితి ఉందంటూ పలువురు వాపోతున్నారు. విద్యార్థులకు సరైన భోజనం అందుతుందా లేదా అని దగ్గరుండి చూసుకోవాల్సిన బాధ్యత వార్డన్లపైన ఎంతైనా ఉంది. సిద్దిపేట నుంచి వచ్చే సరికి 10 గంటలకు వరకు చేరుకుంటారు. అప్పటికి



విద్యార్థులు పాఠశాలలకు వెళ్తారు. సాయంత్రం మూడు గంటలకే హాస్టల్లో నుంచి వెళ్ళిపోతారు. విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడాల్సిన వార్డెన్లు ఇలా పట్టించుకోకపోవడం ఎంత వరకు సమంజసమని పలువురు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి హాస్టల్ వార్డెన్‌పై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నైతిక విలువలపై పోలీస్ ధూంధాం

- కళాబృందం అవగాహన కార్యక్రమం



నవతెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మెదక్ జిల్లా పోలీస్ ధూంధాం కళాబృందం వారి సౌజన్యంతో జాతీయ సేవా పథకం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్ ఆధ్వర్యంలో ఒక విశేష అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు సురేందర్, జనార్ధన్‌లు విద్యార్థులను సామాజిక, కుటుంబ, నైతిక విలువలపై చైతన్యపరిచారు. నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమాజంలో మంచి పౌరులుగా ఎలా వ్యవహరించాలో దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన మెదక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు సమాజం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పట్ల గౌరవభావంతో వ్యవహరించడం అవసరమని, ఈ విలువలను ఆచరించడంలో విద్యార్థులు మరింత ప్రభావవంతంగా ముందుకు సాగాలన్నారు. తమ భవిష్యత్తును ఉన్నత స్థానాల్లో స్ఫూర్తిదాయకంగా నిర్మించుకోవాలని సూచించారు. విద్యార్థులు నేరాల పట్ల అప్రమత్తంగా ఉండి, సమాజంలో సత్ప్రవర్తనను ప్రదర్శించడం ద్వారా మంచి పౌరులుగా ఎదగాలని ఆయన ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సింహారెడ్డి, ఐ. క్యూ.ఏ.సి. కో ఆర్డినేటర్ డాక్టర్ తిరుమల్ రెడ్డి, కళాశాల సాంస్కృతిక విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ వామనమూర్తి, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాజా గౌడ్, అధ్యాపకులు వినోద్ కుమార్, రాజు పాల్గొని, విద్యార్థులను అవగాహన కార్యక్రమంలో చురుకుగా పాల్గొనడానికి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై, వారు సమాజంలో మంచి మార్పులకు కారకులుగా ఎలా మారాలో తెలుసుకునే అవకాశాన్ని కల్పించారు.

ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- ప్రజావాణిలో 212 దరఖాస్తుల స్వీకరణ
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-హవేలి ఘనపూర్

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికి ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి నేరుగా కలెక్టర్ కార్యాలయానికి వచ్చి చెప్పుకోవాలని సూచించారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలను వాటి పరిష్కారానికి సంబంధిత



శాఖల అధికారులను ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కొరకు 10, ధరణి భూ సమస్యలు 63, పింఛన్లు కొరకు 35, రుణమాఫీ16, ఉపాధి కోసం 05, ఇతర సమస్యలకై 83 మంది అర్జిదారులు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు ఆత్మీయ వీడ్కోలు



నవతెలంగాణ-టేక్మాల్

మండల కేంద్రంలో సోమవారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. గత కొంతకాలంగా విధులు నిర్వహిస్తున్న మండల పరిషత్ పర్యవేక్షకులు, పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు బదిలీపై వెళ్లగా, సోమవారం వారిని తాజా మాజీ ఎంపీపీ చింత స్వప్న రవి, స్థానిక ప్రజా ప్రతినిధులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగరీత్యా బదిలీలు సహజమని ఎక్కడ ఉద్యోగం చేసిన ప్రజలకు సేవ చేయాలని వారు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రజలకు ఉద్యోగులు చేసిన సేవలను కొనియాడారు, ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో కృష్ణ, ఎంపీడీవో రియాజ్ దీన్, ఇరిగేషన్ శాఖ ఏఈ ప్రణిత, టేక్మాల్ మేజర్ గ్రామ పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ సుప్రజా భాస్కర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్ప, నాయకులు యంఎ సలీం, చింతా రవి, పాపయ్య షేక్ మహజర్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు కనీస వేతనం వర్తింప చేయాలి

- తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్

నవతెలంగాణ-చేగుంట

దీర్ఘకాలంగా కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బందికి కనీస వేతనం, అలాగే ఎంటీఎస్ వర్తింపచేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చేగుంట తపస్ మండల శాఖ ఆధ్వర్యంలోని వడియారం, పోలంపల్లి, ఆదర్శ పాఠశాల, కేజీబీవీ పాఠశాలలలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ హాజరై ఉన్నత విద్యార్హతలు కలిగి, అర్హత పరీక్షలో మెరిట్ కమ్ రోస్టర్ ద్వారా ఎంపికై గత కొన్ని సంవత్సరాలుగా చాలీ చాలని వేతనాలతో పనిచేస్తూ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, సీఆర్‌టీలు, పీజీసీఆర్‌టీలు అలాగే బోధనేతర సిబ్బంది తీవ్రమైన ఆర్థిక సమస్యలతో మనోవేదనకు గురవుతున్నారు. సుప్రీంకోర్టు నిర్దేశాలకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం చెల్లించాల్సిన ప్రభుత్వం



వీరిపై అధిక పని భారాన్ని మోపుతూ నామమాత్రపు వేతనాలు చెల్లించడం విచారకరమన్నారు. ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించాలని, 010 కింద వేతనాలు చెల్లించాలని, పెండింగ్లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలని, క్యాష్ లెస్ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, తపస్ మండల అధ్యక్షులు రావుల వెంకటేష్, అమరేశ్వరి, బక్కప్ప, శ్రీనివాస్, పద్మ, సునీత, సునీత హెలెన్, సిద్దిరాములు, వసంత, పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

- సామాజిక ఉద్యమ కారుడు సంగమేశ్వర్



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట

అర్హులైన రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ వర్తింపజేయాలని సామాజిక ఉద్యమ కారుడు బి.సంగమేశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు బ్యాంక్ ఖాతాల పేరుతో అక్షర దోషాలు ఇతర సాకులతో రైతులను ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. బ్యాంక్ అధికారులు రైతు రుణం తీసుకున్న ఏడాదితో పాటు మిత్తి ఎంత అయిందో రైతుకు బ్యాంక్ అధికారులు తెలియజేయాలని కోరారు, ఇలాంటి వివరాలు తెలపకుండా రైతుల నుంచి మళ్లీ కొత్త రుణం కోసం పట్టా పాస్ బుక్ ఆర్వోఆర్ కాపీలు తీసుకొని రైతుకు తెలియకుండానే రైతు ఖాతాలో క్రాప్ లోన్ జమచేస్తున్నారు. ఇందులో నుంచి పంటల బీమాకు కూడా డబ్బులు కట్ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రైతు ఎన్నిసార్లు క్రాపు లోను తీసుకుంటే అన్నిసార్లు పంటల బీమా పైసలు కట్ చేసి మిగతా రూపాయలు రైతుల చేతికి అందజేస్తున్నారు. ఇప్పటి వరకు ఏనాడూ రైతులకు ఏ బ్యాంకు నుంచి పంటల బీమా అందలేదు. పంటల బీమా బ్యాంకు నుంచి వర్తించినప్పుడు రైతుల నుంచి ఎందుకు డబ్బులు తీసుకుంటారని ప్రశ్నించారు. వర్షాకాల దృష్ట్యా రైతులకు రైతు భరోసా రూ.15 వేలు వెంటనే బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

హర్ ఘర్ తిరంగా వారోత్సవాలు

నవతెలంగాణ-తూప్రాన్



తూప్రాన్ మున్సిపాలిటీలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా వారోత్సవాల్లో భాగంగా తూప్రాన్ లో అంబేద్కర్ విగ్రహం, బాబు జగ్జీవన్ రామ్‌ల విగ్రహాల వద్ద నిర్వహించారు. బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను శుభ్రపరిచి, పూలమాలలతో అలంకరించారు. తూప్రాన్ మున్సిపల్ అధ్యక్షుడు భూమ్మన్న జానకిరామ్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తాటి విఠల్, ఎస్సీ మోర్చ అధ్యక్షుడు సంఖ్య యాదగిరి, తూప్రాన్ మండల ఇన్చార్జ్ రాముని మహేష్ గౌడ్, ఎస్సీ మోర్చ ఉపాధ్యక్షులు పర్స పోచేందర్, టౌన్ ఉపాధ్యక్షులు పోతరాజ్ నాగరాజు, యువ మోర్చ అధ్యక్షుడు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని తిప్పనగుల్ల గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు కిరణ్ కుమార్‌కి, పరశురాముడు, రాజశేఖర్‌లకు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు సోమవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కల్వకుంట కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు మాధురి దేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాషిణి ఉపాధ్యాయులు మహేశ్వర్, బషీరుద్దీన్, ఏపీపీసీ చైర్మన్, గ్రామస్తులు పాల్గొన్నారు

కొత్త ఆర్‌ఓఆర్ చట్టంలో ధరణి సమస్యలు పరిష్కరిస్తాం



- కిసాన్ జాతీయ ఉపాధ్యక్షుడు, ధరణి కమిటీ సభ్యుడు కోదండ రెడ్డి

నవతెలంగాణ-మద్దూరు

కొత్త ఆర్‌ఓఆర్ చట్టంలో రైతుల ధరణి సమస్యలు పరిష్కరిస్తామని కిసాన్ జాతీయ ఉపాధ్యక్షుడు, ధరణి కమిటీ సభ్యులు కోదండ రెడ్డి తెలిపారు. మండలంలోని మర్మముల శివారు బంజర, గ్రామ రైతుల భూ సమస్యలపై ఆయన సోమవారం గ్రామాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్‌తో రాష్ట్రంలో పేద రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. గ్రామాలలో భూస్వాములు,పెత్తందారులు, కేసీఆర్ ప్రభుత్వ పాలనలో తిరిగి తమ భూములు చేజిక్కించుకొని సామాన్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. బంజర గ్రామంలో మహమ్మద్ దస్తగిరి గ్రామానికి చెందిన 45 ఎకరాలను, అదే గ్రామం చెందిన 30 మంది రైతులకు 40 ఏళ్ల క్రితం అమ్మి ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత దస్తగిరి, కుమారుడు జిలాని, రెవెన్యూ అధికారుల అండదండలతో 45 ఎకరాల భూమిని ఎక్కించుకున్నాడని రైతులు తనతో తెలిపినట్లు తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి రికార్డులను పరిశీలించి,మోకా మీదికి వెళ్లి పూర్తి విచారణ చేసి రైతులకు న్యాయం చేయాలని తహసీల్దారును కోరినట్లు తెలిపారు. రైతుల సమస్యలను సీఎం దృష్టికి, రెవెన్యూ శాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళ్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

వాణిజ్య శాస్త్రంలో సాంకేతిక ప్రాముఖ్యత



నవతెలంగాణ-సిద్దిపేట

ఇటీవల వ్యాపార రంగంలో వస్తున్న ఆధునాతన సాంకేతిక పద్ధతులు, ఉపయోగాలు, వాటి వల్ల వ్యాపార సంస్థలకు, వినియోగదారులకు లభించే వివిధ ప్రయోజనాల గురించి ప్రతిభ డిగ్రీ, పీజీ కళాశాలలో అవగాహన సదస్సులో విశ్వాని విద్యాసంస్థకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బాలశ్రీ ప్రసాద్ వివరించారు. ఆయన మాట్లాడుతూ వివిధ పరిశ్రమలు, వస్తువులను అందించే పలు సంస్థలు వినియోగదారుని అభిరుచులను, అవార్డులను, అవసరాలను ఎప్పటికప్పుడు గమనించి సరసమైన ధరల్లో వారికి అందించాలని, అలాంటి సంస్థలు మాత్రమే నేటి పోటీ యుగంలో నిలదొక్కుకొని విజయాన్ని సాధిస్తాయని అన్నారు. డిజిటల్ సాంకేతికత వల్ల సంస్థల సామర్థ్యం పెరుగుతుందని, వివిధ నిర్ణయాలు తీసుకోవడంలో వినియోగదారుని అవసరాలను నూతన వ్యాపార ఆవిష్కరణలను గుర్తించడంలో వేగంతో పాటు కచ్చితత్వం పెరుగుతుందన్నారు. డిజిటల్ సాంకేతికత పట్ల అవగాహన ఏర్పరచుకున్న యువతకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్య ప్రకాష్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బోరును కబ్జా చేసిన వ్యక్తి పై చర్యలు తీసుకోవాలి

- తాగటానికి మంచినీరు అందించాలి
- రాంపూర్ గ్రామస్తుల ఆందోళన



నవతెలంగాణ-మిరుదొడ్డి

ప్రభుత్వ బోరును, కబ్జా చేసిన వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని, దానిని ప్రజలకు అప్పగించాలంటూ గ్రామస్తులు నిరసనకు దిగారు. ప్రభుత్వం తాగునీటి కోసం వేసిన బోరును వ్యవసాయ పనులకు వాడుకోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్రాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని వాపోయారు. మిరుదొడ్డి మండలం అల్వాల మధిర రాంపూర్ గ్రామస్తులు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గత పదేళ్ల క్రితం గ్రామంలో ఏర్పాటు చేసిన బోరును గ్రామానికి చెందిన వ్యక్తి కబ్జా చేశాడన్నారు. త్రాగునీటి ఎద్దడి ఏర్పడడంతో నీటి కోసం వెళ్తే, నీళ్లు పట్టుకునివ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోరును గ్రామస్తులకు ఉపయోగపడే విధంగా చూడాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఇదే విషయంపై అధికారుల దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వం వేసిన బోరును గ్రామానికి ఉపయోగపడే విధంగా చూడాలని కోరారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో అర్హులకు న్యాయం చేయాలి



నవతెలంగాణ-కొండపాక

కొండపాకలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీలో అనర్హులకు స్థానం కల్పించి అర్హులకు అన్యాయం చేశారంటూ గ్రామానికి చెందిన జంజీరపు బిక్షపతి ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులకు ఇండ్లు కేటాయించాలని సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశాడు. తనకు నివాసము లేదని డబుల్ బెడ్ రూమ్‌కి దరఖాస్తు చేసుకుంటే లబ్ధిదారుల లిస్టులో వచ్చిన పేరును తొలగించారని పేర్కొన్నాడు. ఈ విషయాన్ని మాజీ సర్పంచ్ మాధురి దేవేందర్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్తే తనకు ఇల్లు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చినా రాలేదని వాపోయారు. పంపిణీ చేయకుండా ఉన్న ఇండ్లలో తనకు ఇల్లు కేటాయించాలని కోరారు. అనర్హులకు ఇళ్ళ కేటాయింపు పై తగు విచారణ చేయాలని కోరారు.

గర్భిణీలకు మెరుగుపడుతున్న వైద్య సేవలు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మాతా శిశు సంక్షేమ ఆసుపత్రిలో గర్భిణీలకు వైద్య సేవలు రోజురోజుకు మెరుగు పడుతున్నాయి. గజ్వేల్ ప్రాంతం నుంచి కాకుండా పక్క జిల్లాల నుంచి కూడా ఇక్కడున్న మాతా శిశువు ఆసుపత్రికి గర్భిణీలు ఇక్కడి వైద్య సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రతిరోజు ప్రభుత్వ ఆసుపత్రికి సుమారు 200 మంది గర్భిణీలు వస్తున్నట్లు వైద్యుల ద్వారా తెలిసింది. గర్భిణీలకు సేవలు అందించేందుకు ఇద్దరు మహిళా డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారు.9 నెలలు నిండిన గర్భిణీ స్త్రీలను డాక్టర్ శ్వేతా రెడ్డి పరీక్షిస్తుండగా, నాలుగు నెలల నుంచి 8 నెలలు నిండిన గర్భిణీ స్త్రీలను డాక్టర్ నీలిమ పరీక్షలు చేస్తున్నారు. తగిన వైద్య సిబ్బంది కూడా అందుబాటులో ఉన్నారు. రక్త పరీక్ష, స్కానింగ్, మూత్రం, ఇతర పరీక్షలు సైతం ఆసుపత్రిలో చేస్తున్నారు. గజ్వేల్ నియోజకవర్గంతో పాటు చేర్యాల, తూప్రాన్, దుబ్బాక, తొగుట, ఇతర మండలాల నుంచి గర్భిణీ స్త్రీలు ఇక్కడికి వచ్చి వైద్య సేవలు వినియోగించుకుంటున్నారు. గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం ఇతర అంశాలపై సూచనలు, సలహాలు ఇస్తున్నారు. అంతేకాకుండా రోజుకు 25 మందికి పైగా ఆపరేషన్లు చేస్తుండగా, ఇందులో కొన్ని నార్మల్‌గా అవుతున్నాయి. మరికొన్ని ఆపరేషన్ ద్వారా సేవలందిస్తున్నారు.

2వ విడత దళిత బంధు నిధులను విడుదల చేయాలి



- దళిత బంధు సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు బోనగిరి శ్రీనివాస్

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

జిల్లాలోని బెజ్జంకి మండల ంలోని గ్రామాలకు రెండవ విడత దళిత బంధు నిధులను విడుదల చేయాలని రాష్ట్ర దళిత బంధు సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు బోనగిరి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో సోమవారం వివిధ గ్రామాలకు చెందిన 126 మంది లబ్ధిదారులు తమ వ్యక్తిగత దరఖాస్తులను జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరికి అందజేశారు. ఈ సందర్భంగా బోనగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో రెండవ విడత దళిత బంధు లబ్ధిదారులను పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవోలచే గ్రౌండింగ్ చేసి, కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఆమోదం పొంది లబ్ధిదారుల ఎంపిక చేశారన్నారు. అసెంబ్లీ ఎన్నికల వేళ ఎన్నికల కోడ్ రావటంతో రూ.3 లక్షలను కలెక్టర్ ఖాతాలోనికి జమ చేశారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క దళిత బంధు పథకంలో భాగంగా నిధులు మంజూరు అయ్యేలా చొరవ చూపాలని, వారికి దళిత కుటుంబాలు రుణపడి ఉంటారన్నారు. వారి ఆర్థిక చేయుతకు, ఆర్థిక తోడ్పాటుకు సహకరించాలని ప్రభుత్వాన్ని కలెక్టరు ద్వారా కోరడం అయ్యిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దళిత బంధు సలహాదారు దీటీ బాలనర్సు, ఎలుక దేవయ్య, బిగుళ్ళ మోహన్, డొక్కా ఈశ్వర్, జంగిటి శంకర్, వెన్న అశోక్, సంగెం రూపేష్, 126 మంది దళిత బంధు లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు మారడంలేదు

- ఎస్ఎఫ్ఐ సిద్దిపేట పట్టణ ఉపాధ్యక్షుడు బత్తుల అభి



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రభుత్వం మారిన ప్రభుత్వ పాఠశాలల స్థితుగతులు మారడంలేదని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట పట్టణ ఉపాధ్యక్షుడు బత్తుల అభి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటి అద్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పాలిష్ చేసిన బియ్యాన్ని పెట్టడం వల్ల పౌష్టిక ఆహారం అందడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదనీ, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. రాష్ట్రంలో లిక్కర్‌కి కూడా మంత్రి ఉన్నాడనీ, విద్యారంగానికి మంత్రి లేకపోవడం సిగ్గుచేటనీ అన్నారు. విద్యారంగాన్ని ప్రభుత్వం అస్తవ్యస్తం చేస్తుందని, మొన్న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కూడా విద్యారంగానికి ఆరాకోరా నిధులు కేటాయించి విద్యారంగానికి తీవ్రమైన అన్యాయం చేసిందని అన్నారు. గురుకులాలకు, సంక్షేమ హాస్టళ్లకు, జూనియర్, డిగ్రీ కళాశాలలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియాంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని కోరారు. విద్యా రంగ సమస్యలు పరిష్కరించుకుంటే జిల్లా వ్యాప్తంగా విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున నిరసనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సిద్దిపేట పట్టణ కమిటీ నాయకులు నవదీప్, హర్షవర్ధన్ రెడ్డి, అరుణ్ పాల్గొన్నారు.

మరణించిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు నివాళులు



నవతెలంగాణ-వర్గల్

మండలంలోని మరణించిన వారికి సమగ్ర శిక్ష ఉద్యోగులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మినిమం పే స్కాల్ అమలుచేయాలని, మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోకపోతే దశలవారిగా నిరసనలు తెలియజేస్తూ సమ్మె నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ల యాదగిరి, జిల్లా ప్రధాన కార్యాదర్శి నవీన్, సొప్పరి కరుణాకర్, వరలక్ష్మీ, భూపాల్, జనార్ధన్, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు పీఎఫ్ డబ్బులను వెంటనే చెల్లించాలి

- జిల్లా అధ్యక్షులు కాముని గోపాలస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

సిద్దిపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్‌కి గత మూడేళ్లుగా చెల్లించాల్సిన పీఎఫ్ డబ్బులు చెల్లించకపోవడం సరైనది కాదని, ఆ డబ్బులను వెంటనే వారి అకౌంట్లో జమ చేయాలని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కాముని గోపాలస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ అన్నారు. సోమవారం సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులు మెరుపు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల స్వామి, రవికుమార్ మాట్లాడుతూ దాదాపు రూ.3 కోట్ల పీఎఫ్ డబ్బులు కార్మికుల అకౌంట్లో వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో బాధ్యులైనటువంటి వారిని సస్పెండ్ చేయాలని వారన్నారు. మున్సిపాలిటీ డబ్బులు కట్ చేసి కార్మికుల అకౌంట్లో వెయ్యకపోవడం ముమ్మాటికి అవినీతి ప్రక్రియ అని వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకొని విధుల నుంచి తప్పించాలని అన్నారు. పీఎఫ్ డబ్బులు కార్మికుల అకౌంట్లో వేసేంత వరకు ఈ పోరాటం కొనసాగుతుందని అన్నారు. ధర్నా వద్దకు మున్సిపల్ వైస్ చైర్మెన్ కనకరాజు, మాజీ చైర్మెన్ కడవెరుగు రాజనర్సులు వచ్చి సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని వారు చర్చలకు పిలిచారని చర్చల అనంతరం కార్మికుల పీఎఫ్ డబ్బులు చెల్లిస్తే సమ్మె విరమిస్తామని లేకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికులకు రూ.399 లతో ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని అలాగే 8 గంటల పని మాత్రమే చేయించాలని ఆదివారం, బుధవారం రోజున ఒక పూట మాత్రమే పని చేయించాలని, కార్మికులకి కనీస సౌకర్యాలైన రెండు చేతుల బట్టలు, పార, చీపిరి, బ్లౌజులు, నూనె, సబ్బు, షూలు తదితర వాటిని రెగ్యులర్గా అందించాలని అన్నారు. గ్రూపులు లేనటువంటి వారిని గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి 60వ జీవో ప్రకారం రూ.16,500 ఇవ్వాలని, గ్రూప్ లేని వారికి కేవలం రూ.10వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటామంటే చూస్తూ ఊరుకోమని దీనిపైన ఉద్యమం చేస్తామని అన్నారు. ఇవన్నీ సమస్యల పరిష్కారం చేయలేని ఎడల సమ్మె ను కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజు కుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గుర్రం నరసింహులు, దెబ్బట రాజయ్య, నరసవ్వ కార్మికులు పాల్గొన్నారు.

కుల,మతాలకు అతీతంగా ఉండాలి

- మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి



నవతెలంగాణ-గజ్వేల్

గంగా, జమున, తహసిప్ లాగా గజ్వేల్ పట్టణంలో అన్ని కులాలు, మతాలవారు అన్నదమ్ములు లాగా ఒకరికొకరు కలిసి ఉండాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి గుప్తా అన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని తన్జీముల్ మజీద్ కమిటీ చైర్మెన్‌గా ఎన్నికైన సయ్యద్ మతిను ఆయన శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసమే కాకుండా పట్టణంలోని అన్ని వర్గాల అభ్యున్నతి కోసం తన వంతు సహాయ సహకారాలు అందించాలని పట్టణంలో అందరం అన్నదమ్ముల కలిసి ఉండే విధంగా సహకరించాలన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహకారంతో వ్యాపార సముదాయాన్ని ఏర్పాటు చేశారని, షాది ఖానా ఈద్గా నిర్మించారని అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ముస్లింలందరూ మాజీ సీఎం కేసీఆర్‌కు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నేతి సంతోష్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకుడు అజార్, వైశ్య సంఘం నేతలు పాల్గొన్నారు.

మందు బాబులకు నిలయంగా రైతు వేదిక

- కన్నెత్తి చూడని అధికారులు



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

స్వాతంత్ర్య గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ జాతీయ జెండాను ఎగురవేయడం ప్రతి భారతీయుని ప్రధాన కర్తవ్యం. నేడు అయా ప్రభుత్వ కార్యాలయాల అవరణంలో జాతీయ జెండా ఎగురవేసే దిమ్మెలు మద్యం గ్లాస్‌లకు నిలయాలుగా మారాయి. ఓ రైతు వేదిక అవరణ ముందు ఎగురవేసే జాతీయ మువ్వెన్నెల జెండా దిమ్మెపై మద్యం గ్లాస్ దర్శనమివ్వడం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేశారు. ఈ ఘటన సోమవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని వెంకటాపూర్ రైతు వేదిక ఆవరణలో జాతీయ జెండా దిమ్మె పై మద్యం గ్లాసు, బీరు సీసాలు దర్శనమిచ్చాయి. ఇప్పటికైనా గత ప్రభుత్వం సంకల్పించిన రైతు వేదికలను కాపాడేల వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు సూచించారు.

ప్రభుత్వ కార్యాలయాలు మందుబాబులకు నిలయాలు

మండల పరిధిలోని వివిధ గ్రామాలలో మందుబాబులు ప్రభుత్వ పాఠశాలలు, గ్రామపంచాయతీ కార్యాలయాలు రైతు వేదికలు నిలయంగా మారాయని అయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మందు బాబులు రాత్రి వేళలో విచ్చలవిడిగా మద్యం సేవించి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని, గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు వెలువడటం, కిరాణం,హెూటళ్లలో అక్రమంగా మద్యం విక్రయించడం వల్ల యువత మద్యం, మత్తు పదార్థాలకు బానిసలవుతూ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని పలువురు అవేదన వ్యక్తం చేశారు. పోలీస్, ఎక్సైజ్ శాఖ గ్రామాలలో పర్యవేక్షించి బెల్టు షాపులను మూసివేసి సత్వర చర్యలు చేపట్టాలని పలువురు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

మహిళలు, పిల్లల రక్షణకు పెద్దపీట వేయాలి

- హాట్ స్పాట్స్ వద్ద కంప్లైంట్ బాక్స్‌లు ఏర్పాటు చేయాలి
- సీపీ డాక్టర్ బి. అనురాధ



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

షీ టీమ్, భరోసా, స్నేహిత సెంటర్‌ల అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి మహిళల, పిల్లల రక్షణకు పెద్దపీట వేయాలని సీపీ డాక్టర్ బి. అనురాధ అన్నారు. సోమవారం సీపీ ఆఫీస్‌లో షీటీమ్, భరోసా సెంటర్, స్నేహిత సెంటర్ ల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవిటీజింగ్ తదితర కార్యక్రమాలు జరిగే గుర్తించిన హాట్ స్పాట్ వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని, హాట్ స్పాట్ పరిసర ప్రాంతాలలో షీటీమ్ కంప్లైంట్ బాక్సులు ఏర్పాటు చేయాలని మహిళా ఇన్స్పెక్టర్ దుర్గాకు సూచించారు. ప్రతిరోజు స్కూల్స్, కాలేజీలు తదితర ప్రాంతాలలో మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, మహిళల భద్రత గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మైనర్ అబ్బాయిలు, అమ్మాయిలు కనబడితే కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ యస్.మల్లారెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ దుర్గ, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, మూడు డివిజన్ల షీ టీమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించడంలో రెవిన్యూ అధికారులు విఫలం

- సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్



నవతెలంగాణ-జగదేవ్‌పూర్

భూసమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు బట్టు దయానంద్ రెడ్డి అన్నారు. సోమవారం రైతులకు సంబంధించిన భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో మండల తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో గత ప్రభుత్వం నాలుగు ప్రాజెక్టులను నిర్మించిందని ఆ నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన రైతులకు సంబంధించిన భూ సమస్యలు ఉన్నప్పటికీ వాటిని అధికారులు పరిష్కరించడం లేదని ఆరోపించారు. చిన్న చిన్న సమస్యలను కలెక్టరేట్‌కు వెళ్లాలని రైతులకు సూచించడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు. మండల తహసీల్దారు కార్యాలయంలో సమస్యలను పరిష్కరించకుండా రైతులను ఇబ్బందుల గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రాజెక్టుల కింద లింకు కాల్వల్లో భూములు కోల్పోయిన చాలామంది రైతులు రికార్డులు లేక పట్టాలు గాక తహసీల్దారు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొంతమంది రైతులు రెండుమూడేళ్ల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్న పరిష్కరించడం లేదని దరఖాస్తుల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ధరణి పేరుతో రెవెన్యూ అధికారులు దగాకోరు చేస్తున్నారని విమర్శించారు. తిగుల్ గ్రామానికి చెందిన 22 మంది రైతులకు సంబంధించి కాల్వలో భూములు కోల్పోతే ఇప్పటికీ ఆ సమస్య అలానే ఉందని వివరించారు. పలుసార్లు తహసీల్దారు దృష్టికి తీసుకువచ్చిన పరిష్కరించకుండా రైతులను ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా జిల్లాలో చాలా గ్రామాల్లో భూ సమస్యలు ఉన్నాయని వాటిని తక్షణమే జిల్లా ఉన్నత అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. భూ సమస్యలు పరిష్కరించకుంటే తహసీల్దారు కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు బిక్షపతి, నరసింహ రెడ్డి, మల్లారెడ్డి, రాజేశం, కృష్ణ, రాములు, రామచంద్రం, లింగం, ఎల్లారెడ్డి, బిక్షపతి, ఎల్లయ్య, బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-జగదేవ్‌పూర్

జగదేవపూర్ మండలం పరిధిలోని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇటిక్యాల గ్రామంలో గల ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, షీ టీమ్ నిర్వహిస్తున్న విధుల గురించి, షీ టీమ్ ద్వారా ఎలా రక్షణ పొందొచ్చు అనే అంశాల గురించి, ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో, షీ టీమ్స్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి, అపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్, మాటలు నమ్మవద్దు. సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత బాగా ఉంటుంది అని తెలిపారు. మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం మహిళల భద్రత ముఖ్య బాధ్యత అని తెలిపారు. చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిస కావొద్దు అన్నారు. ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చదువుకోవడం వలన భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని వివరించారు. పిల్లలను చదివించటానికి తల్లిదండ్రులు చేస్తున్న కష్టాన్ని మనసులో పెట్టుకొని చదువుపై శ్రద్ధ వహించాలని, సామాజిక రుగ్మతల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జగదేవపూర్ ఎస్ఐ చంద్రమోహన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవరెడ్డి, అధ్యాపకులు గజ్వేల్ షీటీమ్ బృందం శ్రీరాములు , ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుల్ శ్యామల, కానిస్టేబుల్ రాంచంద్రారెడ్డి, జగదేవపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

- ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుం



నవతెలంగాణ-గజ్వేల్

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వాటిని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుం పేర్కొన్నారు. కళాశాలలో సోమవారం జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవం సందర్భంగా కళాశాల గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. భారత గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ 132వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన గ్రంథాలయ శాస్త్ర అభివృద్ధికి గ్రంథాలయాల అభివృద్ధికి చేసిన కృషిని ఆమె కొనియాడారు. కళాశాల గ్రంథాలయ అధికారి డాక్టర్ వి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ జయంతిని దేశవ్యాప్తంగా జాతీయ గ్రంథపాలకుల దినోత్సవంగా నిర్వహిస్తారని తెలిపారు. కళాశాల గ్రంథాలయంలో అకడమిక్ పుస్తకాలతో పోటీ పరీక్షల పుస్తకాలు, ఈ రిసోర్సెస్ కూడా అందుబాటులో ఉన్నాయని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతి రావు, లైబ్రేరియన్ డాక్టర్ వి.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యధేచ్ఛగా కలప అక్రమ రవాణా..!



నవతెలంగాణ -దుబ్బాక

దుబ్బాక మండలంలోని పలు మారుమూల గ్రామాల నుంచి విచ్చలవిడిగా చెట్లను నరికేసి కలపను తరలిస్తూ సొమ్ము చేసుకుంటూ కొందరు అక్రమ దందాను కొనసాగిస్తున్నారు. కాలువ, పొలం గట్లపై నాటిన అటవీ సమీప ప్రాంతాల్లోని చెట్లను పగలు, సాయంత్రం వేళల్లో నరికేసి చిన్నపాటి దుంగలుగా కొట్టి సిద్ధం చేస్తున్నారు. సాయంత్రం, రాత్రి వేళల్లో డీసీఎంలు, ట్రాక్టర్లలో ఎక్కించి దుబ్బాక పట్టణంలోని పలు కట్టెకోత మిషన్ కేంద్రాలకు, ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. నిత్యం దుబ్బాక పట్టణ కేంద్రానికి పదుల సంఖ్యలో కలప తరలుతోందని సంబంధిత అధికారులు మాత్రం చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణ శివార్లలోని రహస్య ప్రదేశాల్లో, కొన్ని కట్టెకోత మిషన్ల దుకాణాల వద్ద ఈ కలపను పోగు చేసి లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కొందరు అక్రమార్కులు భూ యజమానులతో ఒప్పందం చేసుకుంటున్నట్లు సమాచారం. ఇటుక, బొగ్గు బట్టీలకు ఈ కలపను వాడుతున్నారు. సంబంధిత అధికారులు ఏనాడూ తనిఖీలు చేయడం లేదు. ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటున్నారని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు కలప రవాణాను అరికట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజల భాగస్వామ్యంతో పాఠశాలల అభివృద్ధి

- డీఈవో శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ - కొండపాక

ప్రభుత్వంతోపాటు ప్రజల భాగస్వామ్యంతో పాఠశాలలు పటిష్ఠమై అభివృద్ధి చెందుతాయని డీఈవో ఈ శ్రీనివాసరెడ్డి అన్నారు. కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం మార్స్ ఇండియా కంపెనీ సౌజన్యంతో విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఈవో మాట్లాడుతూ సమాజం, కార్పొరేట్ కంపెనీలు పాఠశాల విద్యార్థుల కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం అందిచడం మంచి పరిణామమన్నారు. విద్యార్థులకు ప్రత్యేక డ్రెస్‌లతో ఆత్మ విశ్వాసం పెంపొందుతుందన్నారు. అలాగే మంచి క్రమశిక్షణతో విద్యను అభ్యసించడానికి అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులలో ఆత్మ న్యూన్యత భావం పోయి, ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తారన్నారు. ఫోన్, టీవీలకు దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ పెట్టి కష్టపడి చదవాలన్నారు.మనం చేసే పని ఇష్టంతో చేస్తే సాధ్యమంటూ ఏది ఉండదన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పి.శ్రీనివాసరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి, పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం ప్రసన్న మణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ-జగదేవ్‌పూర్

అక్రమంగా రవాణా చేస్తున్న 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న సంఘటన చిన్నకిష్టపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. కుకునూరుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట టాస్కోర్స్ అండ్ కుకునూరుపల్లి గజ్వేల్ పోలీసులు చిన్న కిష్టాపూర్ గ్రామ శివారులో ఈ నెల 11వ తేదీన రాత్రి పది గంటల సమయమున చింతల ఉపేందర్, గ్రామం చిన్న కిష్టాపూర్, తన్నీరు గణేష్, గ్రామం చిన్న కిష్టాపూర్ ఇరువురు వ్యక్తులు కలసి ఆటోలో ఏపీ15వై3277, డీసీఎం వ్యాన్ ఏపీ01వై9431లో ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రభుత్వ రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని నమ్మదగిన సమాచారంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు, కుకునూరు పల్లి పోలీసులు వెళ్లి కలిసి పట్టుకుని అక్రమ రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కుకునూరు పల్లి, పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ శ్వేతా ఆదేశానుసారం జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పీడీఎస్ రైస్ అక్రమ రవాణా చేసిన నిల్వ ఉంచిన, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదం, గ్యాంబ్లింగ్ చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. గ్రామాలలో, పట్టణాలలో ఇసుక అక్రమ రవాణా చేసిన, పీడీఎస్ రైస్ అక్రమంగా దాచిపెట్టిన రవాణా గ్యాంబ్లింగ్, పేకాట, గుట్కాలు కలిగి ఉన్న రవాణా చేసిన, మరిఏదైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

చెక్ డ్యామ్‌లో మోటార్లు నిలిపివేయాలి

- కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన గోపులాపూర్ ముదిరాజ్ కులస్తులు



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

చెక్ డ్యామ్‌లో మోటార్లు పెట్టడం నిలిపివేయాలని కోరుతూ నారాయణరావుపేట మండల పరిధిలోని గోపులాపూర్ ముదిరాజ్ కులస్తులు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెక్ డ్యామ్‌లో పదిమంది రైతులు మోటార్లు పెట్టి నీళ్లు తరలించడం ద్వారా పక్కనే ఉన్న చెరువులకు బావులకు నీళ్లు లేకుండా పోతుందని అన్నారు. మోటార్లు పెట్టడం ద్వారా విద్యుత్ షాక్ గురై చేపలు చనిపోతున్నాయని తమ జీవనాధారం కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి చెక్ డాంలో మోటార్లను పెట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాబు, దేవయ్య, సుధాకర్, పరశు రాములు, రాజు, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడి ఆచూకీ లభ్యం



- నవతెలంగాణ పత్రిక యాజమాన్యానికి కృతజ్ఞతలు

నవతెలంగాణ-దుబ్బాక రూరల్

అక్బర్పేట్ భూంపల్లి మండల పరిధిలోని పోతరెడ్డి పేట గ్రామానికి చెందిన రఘు ఈ నెల 10న హైదరాబాదులో చికిత్స పొందుతున్న వాళ్ళ బాబాయ్ ని కుటుంబీకులతో కలిసి చూసేందుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో తప్పిపోయాడు. దీంతో యువకుడు అదృశ్యం అనే వార్తను నవతెలంగాణ పత్రిక సోమవారం ప్రచురించింది. ఈ విషయాన్ని కుటుంబీకులు సోషల్ మీడియా వేదిక ద్వారా పోస్టులు చేశారు. దీంతో అదే గ్రామానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ నర్సాపూర్‌లో పనిచేయడంతో ఆయన అక్కడి సోషల్ మీడియా గ్రూపులో ఫార్వర్డ్ చేశాడు. నర్సాపూర్ ఏరియాలో ఉన్నట్లు సాఫ్ట్‌వేర్ సమాచారం ఇవ్వడంతో యువకుడి తల్లిదండ్రులు బంధువులు వెళ్లి తీసుకొచ్చారు. రఘు ఆచూకీ లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ నవతెలంగాణ పత్రిక ఎంతో దోహదపడిందని, పత్రికలో ప్రచురించిన విషయం ద్వారానే తమ కుమారుడి ఆచూకీ తెలిసిందని ఈ సందర్భంగా పత్రిక యాజమాన్యానికి తాము కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు

స్పందన

'సే నో టు డ్రగ్స్' పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సదాశివపేట : డీవైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కమిటీ నిర్వహిస్తున్న 'సే నో టు డ్రగ్స్' క్యాంపెయిన్‌కు సంబంధించిన పోస్టర్‌ను సెయింట్ ఆంటోనీ హై స్కూల్, రావుస్ విద్యా సంస్థలు, ఎస్సీ హాస్టల్‌లో, కళాశాలలో సోమ వారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ.. డ్రగ్స్ భూతాన్ని అం తం చేయ డం కోసం డీవైఎఫ్ఐ పనిచేస్తున్నదన్నారు. సంగారెడ్డి జిల్లాలో డ్రగ్స్, గంజాయి వంటి మారక ద్రవ్యాలను అరికట్టేందుకు ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి పని చేస్తామన్నారు. యువత చెడు వ్యసనాలను వీడి సన్మార్గంలో నడవాలన్నారు. ఆక్స్‌ఫర్డ్ స్కూల్ కరస్పాండెంట్ కృష్ణ రామకృష్ణ, గ్లోబల్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ రవికుమార్, డీవైఎఫ్ఐ సదాశిపేట పట్టణ కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



నూతన పీఆర్సీని ప్రకటించాలి



- గజ్వేల్ మండల పీఆర్టీయూ అధ్యక్షుడు ఊడెం వేమారెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్

రాష్ట్రంలో నూతనంగా అధికారం లోకి వచ్చిన ప్రభుత్వం నూతన పీఆర్సీని ప్రకటించాలని గజ్వేల్ మండల అధ్యక్ష ప్రధానకా ర్యదర్శులు ఊడెం వేమారెడ్డి లింగంగౌడ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని జెపిహెచ్ఎస్ ప్రజ్ఞాపూర్ జెడ్పీ జీహెచ్ఎస్ ప్రజ్ఞాపూర్ కోదండరామునిపల్లి, తిమక్కపల్లి, శ్రీగిరిపల్లి, అక్కారం దాతుర్పల్లి రిమ్మనగూడ బూరుగుపల్లి, సింగటం, అహ్మదీపూర్, కోల్గూర్, పీడ్బెడ్ పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకీకృత సేవా నిబంధనలు తీసుకువచ్చి జూనియర్ లెక్చరర్లు డైట్ లెక్చరర్లు ఎంఈఓ పోస్టులను ఉపాధ్యాయ పదోన్నతులతో నింపాలని కోరారు. జీఓ11, 12 సవరించి బీఈడ్ అర్హత కలిగిన ఉపాధ్యాయులకు బీయస్ హెచ్ఎంలు కల్పించి పదివేల పోస్టను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షలు శివశంకర్, ఉపాధ్యక్షులు బాల్ చరణ్, కనకరాములు, శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి,కార్యదర్శులు సత్యనారాయణ రెడ్డి, పాల్గొన్నారు.

రోడ్డుకు కంకరతో మరమ్మతులు

- పర్యవేక్షించిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని వడ్లూర్ గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధేశానుసారం మండలాధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్ రోడ్డు మరమ్మతు పనులను సోమవారం గ్రామ నాయకులతో కలిసి పర్యవేక్షించారు. గుంతలమైయమైన రోడ్డును ఎమ్మెల్యే కవ్వంపల్లి అధేశానుసారం కంకరతో గుంతలను పూడ్చి చదును చేయించామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ తెలిపారు. రోడ్డు మరమ్మతులకు కృషి చేసిన ఎమ్మెల్యే, మండల కాంగ్రెస్ నాయకులకు గ్రామ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మంద శేఖర్, పులి సంతోష్, కుక్కల రాములు, పులి రమేష్, మహంకాళి ప్రవీన్, బండిపెల్లి రాజు, అనిల్ పాల్గొన్నారు.

ఆశాజ్యోతి నుంచి తప్పిపోయిన విద్యార్థి



నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో ఉన్న ఆశాజ్యోతి నుంచి పి మోహన్ అనే బాలుడు తప్పిపోయి నట్లు ఆశాజ్యోతి సూపర్వైజర్ రాజు తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 1న ఉదయం 10 గంటల ప్రాంతంలో ఆశాజ్యోతి బ్యాగులు తీసుకొని వెళ్ళినట్లు ఆయన చెప్పారు. ఆ బాలుడికి చెవి వినికిడి సరిగా ఉండదని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు దీనిపై పోలీసులు సైతం ఎఫ్ఐఆర్ ఫైల్స్ చేసినట్లు పేర్కొన్నారు. గజ్వేల్ ప్రాంతంలో గాని ఇతర ప్రాంతంలో గాని బాలుడు కనిపిస్తే ఫోనుకు 8712667460,9440912395 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సీఎం సహాయ నిధి నిరుపేదలకు అండ



- దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ చెరుకు అమర్
- జిల్లా నాయకులు సోలిపేట ప్రసాద్ రెడ్డి

నవతెలంగాణ- దుబ్బాక రూరల్

సీఎం సహాయనిధి నిరుపేదలకు అండగా ఉంటుందని దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ చెరుకు అమర్, జిల్లా నాయకులు సోలిపేట ప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం సీఎస్ఆర్ కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో ఆకారం గ్రామానికి చెందిన కొలిపాక సత్యం వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.2 లక్షల ఎల్ఓసీ చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు సీఎం సహాయనిధి ఎంతో దోహదపడుతుందని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు పేదలకు అండగా ఉంటుందని పేర్కొన్నారు

నవతెలంగాణ-దుబ్బాక రూరల్



ప్రమాదాలు, అనారోగ్య పరిస్థితుల కారణంగా ప్రయివేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పేద ప్రజలకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని దుబ్బాక మాజీ జెడ్పీటీసీ కడతల రవీందర్ రెడ్డి, పద్మనాభునిపల్లి తాజా మాజీ సర్పంచ్ పరశురాములు అన్నారు. సోమవారం సీఎం సహాయనిధి ద్వారా దుబ్బాక మండల పరిధిలోని పద్మనాభుని పల్లి గ్రామానికి చెందిన కంచర్ల పరుశరాములు, సిద్దన కనకవ్వ, కుకునూరి తారలకు రూ. ఒక లక్ష రెండు వేల చెక్కులను తాజా మాజీ సర్పంచ్ పరశురాములు బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు అందించే సీఎం సహాయనిధి చెక్కులు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొమ్మ బాలరాజ్, చింతకింది రమేష్, ముక్కపల్లి హరీశ్ తదితరులున్నారు

నిస్వార్థ నాయకుల ఎన్నికతోనే సర్వోతాముఖాభివృద్ధి

- మాడ్యూలస్ పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి
- ఎన్నికలతో పాఠశాల క్యాబినేట్ ఏర్పాటు

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్



ఎన్నికలలో నిస్వార్థ లక్షణమున్న నాయ కులను ఎన్నుకోవడం వలన సర్వోతా ముఖాభి వృద్ధికి బాటలు వేసుకోవ చ్చని మాడ్యూ లస్ పాఠ శాల ప్రన్సిపాల్ జ్యోతి విద్యార్థులకు సూచించారు. సోమవారం పట్టణం లోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో మాడ్యూలస్ పాఠశాలలో ఓటింగ్ విధానం ద్వార నూతన పాఠశాల క్యాబినెట్ ఎన్నిక నిర్వహించారు. కెప్టెన్ గాలీల వెంకట శ్రావన్, హెడ్ బాయ్‌గా విశ్వక్, హెడ్ గర్ల్ గా అమర, సీసీఏ ఇంచార్జీగా అభయ, స్పోర్ట్స్ ఇంచార్జీగా హర్షిత్, స్వప్న రాగ లీల ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నితిన్, అకాడమిక్ ఇంచార్జీ అల్లా భక్షులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

సర్కార్ పథకాలకోసం ఎదురుచూపులు

- ఎనిమిది నెలలు గడుస్తున్న కదలని ఫైల్

నవతెలంగాణ-గజ్వేల్

ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఉన్న పథకాల అమలు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఎనిమిది నెలలు గడిచిన ప్రభుత్వం ఆ పథకాల కోసం ఫైల్‌ను ముందుకు తీసుకుపోవడం లేదు. సిద్దిపేట జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, రైతు భరోసా, పెన్షన్ పెంపు పథకాల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. మహాలక్ష్మి కింద రు 2500. ఇందిరమ్మ ఇల్లుకు రూ.5 లక్షలు, నూతన పెన్షన్ తో పాటు పాత పెన్షన్లకు నెలకు రూ 4వేలు పెంచుతామన్నారు. ప్రజా పాలన కింద జిల్లాలో499 గ్రామపంచాయతీలు, ఐదు మున్సిపాలిటీ గజ్వేల్ ప్రజ్ఞాపూర్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల, సిద్దిపేట పట్టణంలో 115 వార్డుల్లో దరఖాస్తుల స్వీకరణ చేపట్టింది. 3.76లక్షల దరఖాస్తులు చేసుకున్నారు. వీటిని ఆన్లైన్లో కూడా పొందుపరిచారు. గత 8 నెలలుగా ఇందులో ఏ ఒక్క పథకం కూడా ముందుకు రాకపోవడంతో మహిళలు, వృద్ధులు, ఇండ్ల పథకం కోసం ఎదురుచూస్తున్న ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో ప్రొసీడింగులు

గత ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు హడావుడిగా ప్రతి నియోజకవర్గానికి 5వేల ఇండ్లు కేటాయిస్తూ పేదలకు ప్రొసిడింగ్ అందించింది. వీరంతా మళ్లీ దరఖాస్తు చేసుకున్న వారిలో కూడా ఉన్నారు. దాదాపు గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గాలతో పాటు పాత నియోజకవర్గమైన చేర్యాలలో సైతం ప్రొసిడింగులు అందించారు. సిద్దిపేట జిల్లాలో51685 దరఖాస్తులు చేసుకోగా పాత , ప్రోస్టింగ్లు 30,443 వరకు ప్రొసీడింగులు అందుకున్న లబ్ధిదారులు ఉన్నారు. ప్రభుత్వం వీరికి ఎలా కేటాయిస్తుందో అర్థం కావడం లేదని లబ్ధిదారులు లబోదిబో అంటున్నారు. తాము కూడా ప్రజా పాలనలో మళ్లీ దరఖాస్తు చేసుకున్నామని చెప్పుతున్నారు. పాత ప్రొసీడింగ్లను రద్దు చేస్తారా ? పరిశీలన చేసి ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారికే అవకాశం ఇస్తారా అనేది ఇంకా క్లారిటీ రాలేదు.

పథకాలకు దరఖాస్తులు

ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా 5 పథకాల్లో వివిధ ఉప విభాగాల కింద లబ్ధిదారులు 14,56,516 వివిధ పథకాలను ఎంపిక చేసుకున్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రతినెల రూ.2500, లబ్ధి పొందేందుకు 2,50,915 మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. అదేవిధంగా గ్యాస్ సిలిండర్ కోసం రూ500కు గ్యాస్ సిలిండర్‌కు దరఖాస్తు చేసుకున్నవారు 2,83,767 మంది ఉన్నారు. ఇందులో సగం కూడా ఇంకా అమలుకు నోచుకోలేదని విమర్శలు ఉన్నాయి. రైతు భరోసాలో ప్రతి ఏటా రూ.15 వేలను సాయం పొందేందుకు 1,72,414 రైతులు దరఖాస్తులు అందజేశారు. మరో 80,33 వేలమంది కౌలు రైతులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. వ్యవసాయ కూలీలు రూ.12 వేలు పొందెందుకు 1,44,818 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఆర్థిక సాయం పొందేందుకు సిద్దిపేట జిల్లాలో 2,38,014 మంది దరఖాస్తు చేసుకోగా, అమరవీరుల కుటుంబాలు ఉద్యమకారుల నేపథ్యము ఉన్నవారు 43,31 మంది దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు. గృహ జ్యోతి కింద ఉచిత విద్యుత్ సాయం పొందేందుకు 2,67 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. చేయూత పథకంలో దివ్యంగానే పింఛన్, ఇతర పింఛన్ల కోసం 81,755 మంది దరఖాస్తు చేసుకొని సిద్ధంగా ఉన్నారు. సిద్దిపేట జిల్లాలో ఈ పథకాలు అమలు చేస్తారని ఆశతో ప్రజాపాలన పోటీపడి దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం కొన్ని పథకాలను సగం వరకు అమలు చేసి మిగతా పథకాలకు ఇంకా శ్రీకారం చుట్టుకపోవడంతో ప్రజల్లో ఒక్కింత విమర్శలు వస్తున్నాయి.

పింఛన్‌ను పెంచాలని..



పింఛన్‌ని ఇప్పుడు రెండు వేలు వస్తుంది. చేయి గుర్తు వస్తే నాలుగు వేలు ఇస్తా అని చెప్పిండ్రు. ఎనిమిది నెలలు గడుస్తున్నా పింఛన్ గంతే వస్తుంది. మల్లయాళ్ళకొస్తలేదు. మునుపు 10 తారీకు లోపు వచ్చు. ఇప్పుడు 25 తారీకు దాటుతుంది. సర్కార్ పింఛన్ పెంపు చేసి సకాలంలో ఇవ్వాలి.

-రాజవ్వ అనాజిపురం రాయపోల్ మండలం

నాలువేల పింఛన్ కోసం..



పింఛన్ నాలుగు వేలు వస్తది ఏమో అని ఎదురుచూస్తున్న. ఎనిమిది నెలలైనా ఇంకా వస్తలేదు. అప్పుడేమో ఓట్లు రాంగనే ఇస్తామన్నారు. ఈ పింఛను కూడా గడికి బ్యాంకు కాడికి వెళ్లి అడుగుతే ఇంకా పడలేదు ఇంకా పడలేదు అని చెప్తున్నారు. అప్పుడు జల్దిపడ్డాయి. ఇప్పుడే ఆలస్యం అవుతుంది.

-నరసయ్య అనాజిపురం, రాయపోల్ మండలం

పైసలు వస్తాయని ఆశతో



గజ్వేల్ పట్టణంలో బీడీ కాలనీలో స్థలం ఉండడంతో కొంత డబ్బుతో బేస్మెంట్ పిల్లర్స్ లేపి వదిలిపెట్టాం. అప్పుడే కొంత అప్పు అయింది. ఇల్లు కట్టుకునేందుకు పైసలు లేవు. కాంగ్రెస్ సర్కారు ఓట్ల ముందు ఇస్తామని చెప్పింది. రూ.5 లక్షలు ఇస్తే, కొంత భారం తగ్గుతుంది. మిగతా డబ్బులను అప్పు చేసి పూర్తి చేసుకుంటాం. సర్కార్ నుంచి వచ్చే డబ్బులు తొందరగా వేస్తే బాగుంటుంది. పోయిన సర్కార్ ప్రొసీడింగ్ ఇచ్చింది. అది భద్రంగా ఉంది.

-షఫీయా గజ్వేల్, బీడీ కాలనీ.

ఇచ్చిన హామీలను అమలు చేయండి.



అధికారం కోసం ప్రజలకు మాయమాటలు చెప్పారు. ఎనిమిది నెలలు గడుస్తున్న ఇల్లుకు డబ్బులు ఇవ్వలేదు. పెన్షన్ పెంచలేదు. మహిళలకు చేయూత ఇవ్వలేదు. రైతుకు భరోసా లేదు. రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలు మర్చిపోయారా? రైతును రుణమాఫీ పూర్తిగా చేయలేదు. గత ప్రభుత్వంలో కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేశారు.

-గజ్వేల్ మాజీ జెడ్పీటీసీ బొల్లారం ఎల్లయ్య

ప్రజావాణి దరఖాస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మన చౌదరి
- జిల్లా అదనపు కలెక్టర్ గరీమ అగర్వాల్





నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

"ప్రజావాణి" దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ దరఖాస్తుదారులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ తో కలిసి జిల్లా కలెక్టర్ ఎం మను చౌదరి అర్జిదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మల్లన్న సాగర్ ముంపు గ్రామాలు వారు మత్రాజ్ పల్లి గజ్వేల్ పట్టణానికి చెందిన 150 మందికి , గత ప్రభుత్వము ముంపు బాధితులకు నష్టపరిహారం ఇస్తామని, డబల్ బెడ్ రూమ్ నిర్మాణం చేసి. సొంతంగా 150 గజాలు ప్లాట్లు ఏద్దైన కుటుంబంలో 18 వయసు ఆడపిల్లలకు పెండ్లికి రూ. 7 లక్షల నగదు చెక్కు ఇస్తామని, పశువులకు నష్టపరిహారం, చెట్లకు నష్టపరిహారం, ముంపు గ్రామ బాధితులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఇస్తామని చెప్పి గత ప్రభుత్వం మమ్మల్ని నమ్మించి మోసం చేసింది. ఇప్పటి రాష్ట్ర ప్రభుత్వం దయ తలిచి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ మంత్రివర్యులు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. గతంలో ప్రభుత్వంలో చేసిన తప్పిదాలు నష్టపరియాలు మల్లన్న సాగర్ ముంపు గ్రామాల బాధితులకు ఇవ్వాలని కోరుతూ పెద్ద ఎత్తున 150 కుటుంబాలు వచ్చి దరఖాస్తు పెట్టుకున్నారు. గ్రామాల నుంచి ప్రజావాణి జిల్లా కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలు నేరుగా విన్నవించి పరిష్కరించుకోవడానికి అర్జిదారులు ఎంతో ఆశతో కార్యలయంకి వస్తారని వారందరికీ న్యాయం చేయడం అధికారులుగా మన కర్తవ్యం అని జిల్లా అధికారులకు తెలిపారు. అర్జిదారుల నుంచి తీసుకున్న ఫిర్యాదులు త్వరగా పరిష్కరించి నివేదిక అందించాలి. అర్జిదారులకు ప్రజావాణి కార్యక్రమం పైన నమ్మకం పెరిగిందని క్రమక్రమంగా అర్జిదారుల సంఖ్య పెరుగుతుండడంతో అధికారులు ఎంతో ఉత్సాహంతో పనిచేయ్యాలన్నారు. భూ సంబంధిత, ఆసరా పింఛన్లు, ఇతరత్రా మొత్తం కలపి 37 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ నాగరాజమ్మ, డీఆర్డీఏ పిడి. జయదేవ్ ఆర్యా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ అబ్దుల్ రహమాన్, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో తలనీలాల టెండర్ గోల్ మాల్

- ఆలయ ఈవో పారదర్శకంగా వ్యవహరించాలి
- సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి



నవతెలంగాణ- కొమురవెల్లి

కొమురవెల్లి మల్లన్న ఆలయంలో తలనీలాల టెండర్‌లో గోల్ మాల్ జరుగుతుందని దీన్ని ఆన్లైన్లో నిర్వహించాలని సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ ఆలయంలో తలనీలాలకు గత ఏడాది 86 లక్షలకు టెండర్ అయిందని ఈసారి తక్కువ ధరకు దక్కించుకోవడానికి ఓ కాంగ్రెస్ నాయకుడు ఆలయ అధికారులను తప్పుదోవ పట్టిస్తూ బయట వ్యక్తులు టెండర్‌లో పాల్గొనకుండా చేస్తున్నాడని ఆరోపించారు. తలనీలాల టెండర్ ఈసారి పలుమార్లు వాయిదా పడడంతోనే పలు అనుమానాలకు తావిస్తుందని ఆలయ ఆదాయానికి గండి కొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తలనీలాల టెండర్ ప్రక్రియలో ఆలయ ఈవో బాలాజీ పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ టెండర్ ప్రక్రియ ను పూర్తిగా ఆన్లైన్లో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ అవకతవకలపై దేవాదాయ రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. భక్తులు గతం కన్నా అధిక సంఖ్యలో ఆలయానికి వస్తున్నారని మిగిలిన టెండర్లు హెచ్చు పాటలు పాడి దక్కించుకుంటున్నారని తలనీలాల టెండర్ ప్రక్రియలో గోల్మాల్ జరుగుతుందని తెలిపారు. వెంటనే ఆన్లైన్‌లో టెండర్ నిర్వహించాలని లేనిపక్షంలో సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన లేవనెత్తుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, బద్దిపడగ కృష్ణారెడ్డి, నాయకులు తేలు ఇస్తారీ, తాడూరి మల్లేశం, చింతల శ్రీనివాస్, నీలా బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి

- తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు యాదగిరి



నవతెలంగాణ- రాయపోల్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల హామీలలో భాగంగా తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి తమ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాయపోల్ మండల అధ్యక్షులు మాసాయిపేట యాదగిరి అన్నారు. సోమవారం రాయపోల్ మండల కేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలుపుతూ, విధి నిర్వహణలో అమరులైన ఉద్యోగులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులుగా పనిచేస్తూ మరణించిన ఉద్యోగులకు నివాళులు అర్పించామన్నారు. ఉద్యోగంలో ఉండి మృతి చెందిన ఉద్యోగులకు ప్రభుత్వం పది లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగులకు ఐదు లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమగ్ర శిక్షా ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్సీ సిబ్బంది సీసీఓ రఘురాములు, ఐఆర్పీ వనజ, కేజీబీవీ సిబ్బంది రజిత, కవిత, జ్యోతి, లావణ్య, యాదమ్మ, మంజుల, సరిత, సత్యవ్వ సీఆర్పీలు కుమారస్వామి, స్వామి, పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్స్ భాస్కర్, రమేష్, యాదగిరి పాల్గొన్నారు.

పద్మశాలీలు, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- రాష్ట్ర సంఘం అధ్యక్ష అభ్యర్థి బూర మల్లేశం



నవతెలంగాణ- గజ్వేల్

పద్మశాలీలు, చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్ష అభ్యర్థి బూర మల్లేశం పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణ పద్మశాలి సంఘం ఆయనకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన సందర్భంగా మున్సిపల్ మాజి చైర్మెన్ గాడిపల్లి భాస్కర్, పద్మశాలి సంఘం అధ్యక్షులు రాజారాం, న్యాయవాది తలకొక్కుల రాజుతో కలిసి ఆయన మాట్లాడారు. పద్మశాలీల ప్రధాన వృత్తి చేనేత కాగా, ప్రపంచవ్యాప్తంగా చేనేత వృత్తికి మంచి డిమాండ్ ఉన్నప్పటికీ వారి జీవితాలలో మాత్రం వెలుగులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న పద్మశాలీల జీవితాలు అగమ్య గోచరం కాగా, పాలకులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమని నిలదీశారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పద్మశాలీలను సంఘటితం చేస్తూ సమస్యల పరిష్కారం లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు స్పష్టం చేశారు. చేనేత ఉత్పత్తుల ముడి సరుకుపై జీఎస్టీ విధించడం ఎంత మాత్రం తగదని నిలదీశారు. జీఎస్టీ రద్దుతో పాటు 50 ఏండ్లు నిండిన ప్రతి చేనేత పద్మశాలి కార్మికుడికి ఆసరా పెన్షన్ మంజూరి తన లక్ష్యమని అన్నారు. అంతే కాకుండా హైదరాబాద్‌లో సకల వసతులతో కూడిన పద్మశాలి భవన్ నిర్మాణం, పద్మశాలి కుటుంబ సభ్యులకు పెన్షన్ సౌకర్యం, రూ 5 లక్షల రుణ సదుపాయం, చేనేత మిత్ర, చేనేత భీమా పథకాల సద్వినియోగం, ఆరోగ్య బీమా, విద్యుత్ రాయితీ, చేనేత రంగం మనుగడకు అవసరమయ్యే ప్రతి అంశాన్ని దృష్టిలో పెట్టుకొని తాను ఉద్యమ స్ఫూర్తితో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శ్రమించనున్నట్లు చెప్పారు. కాగా రాష్ట్రంలోని మెజార్టీ జిల్లాల పద్మశాలీలు తనకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుండగా, తనకున్న రాజకీయ అనుభవంతో పద్మశాలీల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా కృషి చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డాక్టర్ కస్తూరి సతీష్, సంఘ బాధ్యులు గాడిపల్లి శ్రీనివాస్, తలకొక్కుల ప్రేమ్ కుమార్, గుండు మల్లేశం, నాగరాజు నేత, మెరుగు శ్రీనివాస్, గాడిపల్లి బలరాం, బాలచంద్రం పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





నవతెలంగాణ-సిద్దిపేట

ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరిం చుకొని సోమవారం సిద్దిపేట ఏఐఎస్ఎఫ్ కార్యాలయం వద్ద శ్వేత అరుణ పతాకాన్ని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు మంద పవన్ ఆవిష్కరించి వేడుకలను ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ ముష్కరుల పాలన నుంచి విముక్తి కోసం, దేశానికి స్వతంత్రం తీసుకురావడమే లక్ష్యంగా 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో గల బెనారస్ యూనివర్సిటీలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందని అన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో సుమారు నాలుగువేల మంది ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు అమరులయ్యారని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత దేశంలోని పేద, బడుగు, బలహీన వర్గాలకు ఉన్నత విద్య అందాలని గత 89 ఏళ్లుగా చదువు-పోరాడు నినాదంతో ముందుకెళు ందన్నారు. ప్రస్తుతం దేశంలో పాలక ప్రభుత్వాలు అవలం బిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను నిరంతరం ఎండగడుతూ కార్పొరేట్, ప్రయివేట్ విద్యా వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్ర మంలో ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి జెరిపోతుల జనార్దన్, జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్నకుమార్, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు కనుకుంట్ల శంకర్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కిష్టపురం లక్ష్మణ్, మిట్టపల్లి సుధాకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ నాయకులు బానోతు నవీన్, జక్కుల అనిరుద్, శ్రీనివాస్, రాజేందర్, రమేష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

పోరాటాలే ఊపిరిగా, విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం విద్యార్థుల పక్షాన నిలబడుతున్న ఏకైక సంఘం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) మాత్రమేనని ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి జేరుపోతుల జనార్ధన్ అన్నారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం రోజున గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంలో ఇందిరా గాంధీ చౌరస్తాలో ఏఐఎస్ఎఫ్ పథకాన్ని ఏఐఎస్ఎఫ్ మాజీ మెదక్ జిల్లా నాయకులు స్వర్గం రాజేశం ఆవిష్కరించి ఘనంగా ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. అనంతరం జనార్ధన్ మాట్లాడుతూ సమరశీల ఉద్యమాలకు ఊపిరి పోసి దేశ స్వాతంత్ర్య పోరాటంలో విద్యార్థులను ఏకం చేసి బ్రిటిష్ మూకలను ఈ దేశం నుంచి తరమడంలో ముందు వరసలో పోరాడిన విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. దేశ స్వతంత్ర ఉద్యమంలో అనేకమంది విద్యార్థి నాయకులు తమ ప్రాణాలను సైతం తునప్రా యంగా దేశ దాస్యశృంఖలాలను తెంచడం కోసం ధారబోసా రని, అలాంటి చరిత్ర కలిగిన విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని మొదల ుకొని మలిదశ తెలంగాణ పోరాటంలో రాష్ట్ర ఏర్పాటు లక్ష్యంగా ప్రత్యేక ఉద్యమాన్ని నడిపించిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని గుర్తు చేసారు. విద్య ప్రయివేటుపరం కాకుండా ప్రభుత్వ విద్య పేద బడుగు బలహీన వర్గాలకు అందే విధంగా ఉండాలని, నిరంతరం విద్య ప్రయివేటీకరణకు, కార్పొరేటీకరణకు, కాషాయీ కరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి సంఘం అని తెలియజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు మంద పవన్ మాట్లాడుతూ విద్యార్థి సంఘం 88ఏళ్ల సుదీర్ఘ ఉద్యమాన్ని పూర్తిచేసుకుని 89వ ఏడాదిలోకి అడుగుపెతున్న సందర్భంగా వీధి వీధినా విద్యార్థులు ఏఐఎస్ఎఫ్ జండాను ఆవిష్కరించి, ఉద్యమాలకు విద్యార్థి విద్యార్థులను సంఘటిత పరిచేందుకు ఉపయోగపడుతుందన్నారు. విద్య అంగడి సరుకు కాకుండా సమాన విద్య, శాస్త్రీయ విద్య అందే విధంగా పాలక పక్షాలు నిర్ణయాలు చేసేంతవరకు ఈ విద్యార్థి సంఘం ఉద్యమాలు నిర్వహిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేశ్, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు రాములు, ఉపాధ్యాయ సంఘం మాజీ నాయకులు రామచంద్రం, సీపీఐ నాయకులు శివలింగు కృష్ణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు రమేష్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేర్యాల



ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరి ంచుకొని ఏఐఎస్ఎఫ్ మండల సమితి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో అరుణ పతాకాన్ని గర్ల్స్ జిల్లా కన్వీనర్ ఆకుల శిరీష ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై విద్యార్థులను చైతన్య పరుస్తూ యూనివర్సిటీ, డిగ్రీ కళాశాలలు, పాఠశాలలు ప్రతి ప్రాంతంలో సమస్యలను వెలికి తీసి అధికారులకు సమస్యలను తెలియజేస్తూ ఆ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమించిన సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. ఈ నెల 12 నుంచి 30 వరకు దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘం ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, విద్యార్థులు, మేధావులు ఈ ఉత్సవాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేర్యాల ఏఐఎస్ఎఫ్ మండల కన్వీనర్ మహమ్మద్ యాసిన్, నాయకులు హనుమాన్, పోతుగంటి హర్షవర్ధన్, కల్లాటి చందు, వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మెన్, వైస్ చైర్మెన్‌లపై నెగ్గిన అవిశ్వాసం

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ వంగ చంద్రారెడ్డి (బీఆర్ఎస్), వైస్ చైర్మెన్ తాల్లపల్లి నర్సయ్య ల వ్యవహార శైలి నచ్చక పోవడంతో సహకార సంఘం డైరెక్టర్‌లు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. చైర్మెన్, వైస్ చైర్మెన్‌ల పైన గత ఏడాదే ఏడుగురు డైరెక్టర్‌లు అవిశ్వాసం తీర్మానం పెట్టగా, రాష్ట్ర సహకార సంఘం ట్రిబ్యునల్ అవిశ్వాసం పై స్టే విధించింది. ట్రిబ్యునల్ విధించిన స్టే గత నెల 7న ఎత్తివేయడంతో సహకార ట్రిబ్యునల్ కోర్టు ఆదేశాల మేరకు జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) కరుణ, అసిస్టెంట్ డీసీఓ రఘోత్తంరెడ్డి సోమవారం చేర్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో డైరెక్టర్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. చైర్మెన్ చంద్రారెడ్డి సమావేశానికి గైహాజరయ్యారు. 11 మంది డైరెక్టర్‌లు చైర్మెన్, వైస్ చైర్మెన్‌లకు వ్యతిరేకంగా, అవిశ్వాసానికి అనుకూలంగా చేతులు పైకి ఎత్తడంతో చైర్మెన్ చంద్రారెడ్డి, వైస్ చైర్మెన్ తాళ్ళపల్లి నర్సయ్య ఆ పదవుల నుంచి తొలగిస్తున్నట్లు జిల్లా అధికారి కరుణ ప్రకటించారు. కాగా నూతన చైర్మెన్ ఎన్నిక కోసం ఈ నెల 14 వరకు గడువు పెట్టగా తాత్కాలిక చైర్మెన్‌గా మేరుగు కృష్ణ(కాంగ్రెస్ పార్టీ)ను డైరెక్టర్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు



నవతెలంగాణ-చేర్యాల

విద్యాశాఖలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పదోన్నతులు, బదిలీలలో భాగంగా చేర్యాల మండల పరిధిలోని కడవేర్గు ప్రాథమిక పాఠశాల నుంచి పదోన్నతులు, బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు, సహాయక సిబ్బందికి సోమవారం శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయురాలు కె.ఉమారాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో కడవేరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాలలో గత 13 ఏళ్లగా పాఠశాలలో విధులు నిర్వహించి ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతంగా తీర్చిదిద్దడం జరిగిందని, వేరే పాఠశాలలకు పదోన్నతి, బదిలీపై వెళ్లి అక్కడి పాఠశాలలో పేరు ప్రఖ్యాతలు సంపాదించి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు మద్దూరి పుష్ప, పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఎస్. యాదగిరి, చిరుమల్ల అచ్యుతేందర్, కొలిపాక నర్సింహులు, మంద శ్రీనివాసరెడ్డి, కొక్కుల సీతారాములు, సహాయక సిబ్బంది లంబ లక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు ఎ.ఇంద్రసేనా రెడ్డి, జి.బుచ్చయ్య, బి. అజయ్ కుమార్, వి.వేణుగోపాల్, కొడిపల్లి ప్రశాంత్ కుమార్ అంగన్వాడి ఉపాధ్యాయులు కనికరం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కరాటే విద్యతో ఆత్మస్థైర్యం పెంపు

- మాస్టర్ శ్రీకాంత్




నవతెలంగాణ-దుబ్బాక

కరాటే విద్యతో శారీరక ధారుడ్యంతో పాటు మానసికంగా ఆత్మస్థైర్యం పెంపొందించుకోవచ్చని యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు, మాస్టర్ బురాని శ్రీకాంత్ చెప్పారు. సోమవారం దుబ్బాక పట్టణ కేంద్రంలో నిర్వహించిన 'కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్'లో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్స్, బెల్టులను మాస్టర్ శ్రీకాంత్ అందజేశారు. ఈ పోటీల్లోసిద్దిపేట, దుబ్బాక ప్రాంతాలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొనగా 18 మంది విజేతలుగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా విజేతలకు సర్టిఫికెట్లను ప్రధానం చేసి అభినందించారు. కరాటే లో శిక్షణ పొందేందుకు ఆసక్తి కలిగి ఉన్న విద్యార్థులు తమను సంప్రదించాలని కోరారు. ఆయన వెంట హర్షవర్ధన్, యశ్వంత్ ఉన్నారు.

అవకతవకలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలి


- ఏఐఏవైఎస్ మండలాధ్యక్షుడు దీటీ బాలనర్స్
- దాచారం 124 పరిహారమందజేతలో అధికారుల అక్రమాలు
- అధికారులపై చర్యలు చేపట్టాలని ప్రజావాణిలో ఫిర్యాదు



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

జిల్లా సమకృత కలెక్టర్ కార్యాలయంలో సోమవారం బెజ్జంకి మండల పరిధిలోని దాచారం గ్రామ శివారులోని సర్వే నంబర్ 124 యందు పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం సేకరించిన భూములకు పరిహారం పంపిణీలో గతంలో విధులు నిర్వర్తించిన తహసిల్దార్ విజయ ప్రకాశ్ రావు,గిర్దావర్ రాజయ్య,సర్వేయర్ అరుణ్ అవకతవకలకు పాల్పడ్డారని ఏఐఏవైఎస్ మండలాధ్యక్షుడు దీటి బాలనర్స్ ఆరోపించారు.124 యందు ప్రభుత్వం సేకరించిన భూముల్లో భూముల్లేని వారికి భూములున్నాయని ముగ్గురు రెవెన్యూశాఖ అధికారులు ప్రభుత్వంతో పాటు అసలైన రైతులను మోసం చేశారని వారిపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని సోమవారం కలెక్టరేట్ యందు నిర్వహించిన ప్రజావాణిలో దీటీ బాలనర్స్ పిర్యాదు చేశారు. మామూళ్ల మతులోఅవినీతికి పాల్పడి అర్హులైన రైతులను మోసం చేసిన గత తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు,గిర్దావర్ రాజయ్య,సర్వేయర్ అరుణ్ పై జిల్లాధికారులు సమగ్ర విచారణ జరిపి అర్హులైన రైతులకు న్యాయం చేయాలని దీటీ బాలనర్స్ విజ్ఞప్తి చేశారు.

పదవులు అమ్ముకుంటున్న డీసీసీ అధ్యక్షులు




నవతెలంగాణ-సిద్దిపేట

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నర్సారెడ్డి పదవులు అమ్ముకుంటున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే తన అనుచరులద్వారా దాడులకు, అక్రమ కేసులు పెడుతామంటూ బెదిరిస్తున్నాడని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు యేశం నాగరాజు యాదవ్ మండిపడ్డారు. సిద్దిపేటలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పై నర్సారెడ్డి వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. ప్రతిపక్షం, స్వపక్షం అని తేడా లేకుండా ఇబ్బందులకు గురిచేస్తుండని మండిపడ్డారు. నర్సారెడ్డి బీసీల వ్యతిరేకి అని, బీసీలు అంటే చిన్నచూపని, బీసీలను రాజకీయంగా అణగతొక్కుతూ డ్రామాలాడుతున్నదన్నారు. రాజకీయంగా ఎదుగుతుంటే ఓర్వ లేక ఇబ్బదులకు గురిచేస్తున్నాడన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ అనుచరునిగా ఉంటూన్నానని, ఫ్లెక్సీల్లో దామోదర్ రాజనర్సింహ ఫోటోలు పెడితే ఎందుకు ఫోటోలు పెడుతున్నావంటూ ప్రశ్నిస్తున్నారన్నారు. ఇంకోసారి కార్యకర్తలను సస్పెండ్ చేస్తా నాని బెదిరిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులూ లడ్డు యాదవ్, బిక్షపతి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సమాజ చైతన్యం కోసం కృషి చేస్తా

- ఇంపాక్ట్ ఫౌండేషన్ శిక్షకుడు మన్నె సురేష్



నవతెలంగాణ-రాయపోల్

ఇంటికో వక్త ఊరుకో శిక్షకుడు అనే నినాదంతో సమాజంలోని ప్రతి ఒక్కరుని చైతన్య పరచడమే ఇంపాక్ట్ ఫౌండేషన్ లక్ష్యమని ఇంపాక్ట్ ఫౌండేషన్ శిక్షకులు మన్నె సురేష్ అన్నారు. సోమవారం ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రైన్ దే ట్రైట్యనర్ వర్క్ షాప్ ఆదివారం, సోమవారం రెండు రోజులు నిర్వహించి, నేటి సమాజానికి తన వంతుగా ఏదైనా చేయాలనుకున్న తపనతో ఇంపాక్ట్ ఫౌండేషన్ లో చేరానని ఆయన పేర్కొన్నారు. సమాజాన్ని మేలుకొల్పే ఒక శిక్షకుడిగా ముందుకు సాగుతానని ఆయన పేర్కొన్నారు. ఇంకా చాలామందిని శిక్షకులుగా తయారు కావాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసిన అనంతరం ఉత్తమ సర్టిఫికెట్ అందజేశారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ యజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ రీజియన్ ప్రెసిడెంట్ నూనె సుదర్శన్, సీనియర్ లాయర్ లోడింగ్ గోవర్ధన్, రీజియన్ డైరెక్టర్ సరిత, ఇంపాక్ట్ మిర్యాలగూడ ఇన్చార్జి పానుగోతు రవికుమార్,ఇంపాక్ట్ సభ్యులు గూడూరు అంజిరెడ్డి,కోట్ల సాయికిరణ్, బంద్రెల ఆనంద్ బాబు, జహంగీర్, పన్నీరు హర్షిత తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్‌లు స్వాధీనం




నవతెలంగాణ -నంగునూరు

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్ లను స్వాధీనం చేసుకున్నట్టు రాజగోపాల్ పేట ఎస్సై ఎం.డి.అసీఫ్ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున తన సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా నంగునూరు మండలం బద్దిపడగ గ్రామ బస్టాండ్ వద్ద తంగళ్లపల్లి గ్రామానికి చెందిన రాయవేని రమేష్, రాధారం తిరుపతి వారి ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొన్నట్లు చెప్పారు. ఆ రెండు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేశామని తెలిపారు.

నిరాధారమైన ఆరోపణలు సరికాదు

- మాజీ సర్పంచ్ శెట్టి సుధాకర్




నవతెలంగాణ-కోహెడ

నిరాధారమైన ఆరోపణలు చేయడం సరైన చర్య కాదని మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శెట్టి సుధాకర్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం ప్యాక్స్ ఛైర్మన్ దేవేందర్‌రావు ప్రభుత్వం మహాలక్ష్మి పథకం అమలు చేయడం లేదని ఆరోపించడం సరికాదన్నారు. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుంటే ఓర్వలేకనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో చేయలేని పనులు ఇప్పుడు చేస్తున్నామన్నారు. 10 సంవత్సరాల కాలంలో కోహెడ ఎక్స్‌రోడ్ నుంచి మండల కేంద్రానికి రోడ్డు వేయలేదని ఎద్దేవా చేశారు. ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చెస్తే రానున్న రోజులలో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.

దేశ భవిష్యత్తుకు యువతే ప్రధానం

- బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు బిగుల్ల మోహన్



నవతెలంగాణ-బెజ్జంకి

దేశ భవిష్యత్తుకు యువతే ప్రధానమని దేశంలో సమూలమైన మార్పుకు యువత అన్ని రంగాల్లో రాణించాలని బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు బిగుల్ల మోహన్ సూచించారు. సోమవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా యువతకు బిగుల్ల మోహన్ పలు సూచనలు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న ఈ తరుణంలో యువత చెడు మార్గాలు, చెడు వ్యసనాల వైపు దృష్టి సారించి పెడదారి పడుతున్నారని, మత్తు పదార్థాల వినియోగం వల్ల భవిష్యత్తు ప్రమాదకరంగా మారుతుందని మోహన్ హెచ్చరించారు. మత్తు పదార్థాలను పూర్తిస్థాయిలో నిలువరించేల యువత ప్రధాన భూమికను పోషించి దేశ భవిష్యత్తుతో పాటు సమసమాజ స్థాపనకు నిరంతరం కృషి చేయాలని యువతకు బిగుల్ల మోహన్ సూచించారు.

రైతు పెట్టుబడి సాయంకు మోక్షం ఎప్పుడు

- బీజేపీ ములుగు గ్రామ అధ్యక్షుడు కొల్తూరు శ్రీనివాస్



నవతెలంగాణ-ములుగు

సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రంలోని ములుగు గ్రామ బీజేపీ అధ్యక్షుడు కొల్తూరు శ్రీనివాస్ సోమవారం ఈ విధంగా మాట్లాడారు వానాకాలం అయి పోయి రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు రైతులకు ఏ విధమైన రైతు భరోసా(రైతు పెట్టుబడి సాయం) రాలేదని అన్నారు. ఇంకొక నెల అయితే రైతు యాసంగి పంట రైతు భరోసా ఇవ్వాలి. ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి రైతు పెట్టుబడి సాయం ఇవ్వలేదని అన్నారు

జిల్లాస్థాయిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేపట్టాలి



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్లు గరీమ అగ్రవాల్, శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహణపై జిల్లా అధికారులతో చర్చించి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15న స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా గ్రామపంచాయతీ, మండల కార్యాలయాల్లో ఉదయం 8 గంటలకు, ఐడీఓసీ, జిల్లా అధికారుల కార్యాలయాలలో ఉదయం 8:30 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించాలని అన్నారు. ఉదయం 9:30 గంటలకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ముఖ్య అతిథిచే జాతియ జెండా ఆవిష్కరణ, స్వాతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లా స్థాయిలో నిర్వహించడం జరుగుతుందని ఈ వేడుకలకు అన్ని శాఖల జిల్లా అధికారులు సిబ్బందితో సహా హాజరుకావాలని అన్నారు.

ఈ వేడుకలకు వచ్చే వీఐపీలకు, స్వాతంత్ర సమరయోధులకు, అధికారులకు, జిల్లా ప్రజలకు, విద్యార్థిని విద్యార్థులకు, ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా వారికి ఎలాంటి అసౌకర్యాలు, ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేయాలని సూచించారు. వేడుకల నిర్వహణలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, త్రాగునీరు, మెడికల్ స్టాల్ అందుబాటులో ఉంచాలని అలాగే పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. డిగ్రీ కళాశాల గ్రౌండ్లో స్టేజ్ ఏర్పాటు, బ్యారికేడింగ్, డయాస్ డెకరేషన్, మైక్ సెట్, పోలీస్ పెరేడ్ ఏర్పాట్లు, ప్రజా పాలనకు సంబంధించిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహాలక్ష్మి, గృహజ్యోతి, మహిళా శక్తి, రైతు రుణమాఫీ, స్వచ్ఛదనం పచ్చదనం, వనమహోత్సవం, అమ్మ ఆదర్శ పాఠశాలలు తదితర పథకాలపై శకటాలను ప్రదర్శించాలని, ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలపై స్టాల్స్ ఏర్పాటు చేయాలని, పాఠశాల విద్యార్థులచే స్వాతంత్ర దినోత్సవానికి సంబంధించిన అంశాలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, స్వాతంత్ర సమరయోధులను సన్మానించేందుకు ఏర్పాట్లు చేయాలని, ఉత్తమ ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలతో సన్మానించేందుకు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీఓ సదానందం, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్, సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

అక్రమంగా రవాణా చేస్తున్న ప్రభుత్వ రేషన్ బియ్యం సిద్దిపేట టాస్ఫోర్స్, గజ్వేల్ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం నమ్మదగిన సమాచారం తో 20 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. ఈ సందర్భంగా స్టార్ ఫోర్స్ పోలీసులు మాట్లాడుతూగజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముట్రాజ్ పల్లి చౌరస్తా వద్ద భుక్య నితిన్, గ్రామం మోహిని గడ్డ తండా, బొమ్మలరామారం మండలం, జిల్లా యాదాద్రి భువనగిరి తన ఆటో నెంబర్‌లో వస్తున్న క్రమంలో పట్టుకున్నామన్నారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రభుత్వ రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని నమ్మదగిన సమాచారంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు వెళ్లి పట్టుకుని, బియ్యం స్వాధీనం చేసుకున్న మన్నారు. పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశానుసారం జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పీడీఎస్ రైస్, అక్రమ రవాణా చేసిన నిల్వ ఉంచిన, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదం, గ్యాంబ్లింగ్ చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. గ్రామాలలో, పట్టణాలలో ఇసుక అక్రమ రవాణా ప్రత్యేకమైన రాజకీయాల గారు పీడీఎస్ రైస్ అక్రమంగా దాచిపెట్టిన రవాణా చేసిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్యాంబ్లింగ్, పేకాట, గుట్కాలు కలిగి ఉన్న రవాణా చేసిన, మరిఏదైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

జాతీయ జెండాను గౌరవించని వాళ్లు దేశంలో అవసరమా

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు



నవతెలంగాణ-సిద్దిపేట

జాతీయ జెండాను గౌరవించని వాళ్లు దేశంలో ఉండడం అవసరమా అని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. సోమవారం సిద్దిపేటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి బీజెవైఎం జిల్లా అధ్యక్షుడు నీలం దినేష్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపీ పాల్గొని తిరంగా ర్యాలీని ప్రారంభించి, పురవీధుల్లో తిరిగారు. ర్యాలీలో విద్యార్థులు భారీ జాతీయ జెండాను ప్రదర్శించారు. పాత బస్టాండ్ సర్కిల్ వద్ద ఎంపీ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాల అవుతున్నందున ప్రతి వ్యక్తి తన ఇంటి పై జాతీయ జెండా ఎగుర వేయాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారన్నారు. ఈ దేశంలో కొంతమంది తాము జాతీయ జెండా ఎగురవేయమని, జాతీయ గీతం పాడమని అంటున్నరని, వారు మన దేశంలో ఉండడం అవసరమా ప్రజలు ఆలోచించాలని అన్నారు. బంగ్లాదేశ్ ప్రధాని మన దేశానికి వచ్చి శరణు గోరుతుందంటే మన దేశ బలమేంటో అర్థం చేసుకోవాలన్నారు. దేశంలోని 140 కోట్లమంది ప్రజలు జాతీయ జెండా వారి ఇంటిపై ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఏ దుర్మార్గుడు అయితే జాతీయ జెండా ఎగుర వేయ, పాలస్తీనా జిందాబాద్ అని పార్లమెంటులో నినాదాలు చేస్తాడో అలాంటి వాళ్ళని ఈ దేశంలో పోటీ చేయకుండా ఉండేందుకు చట్టం తేవాలని అన్నారు. మన దేశ గౌరవాన్ని కాపడని వాళ్ళు వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉండేందుకు చట్టం చేసేందుకు ఆలోచన చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి, నాయకులు అంబటి బాలేష్ గౌడ్, రామచంద్ర రావు, రామచంద్ర రెడ్డి, విద్యాసాగర్, విబీషన్ రెడ్డి, కోడూరి నరేష్, గోనె మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే మరో రెండు అంబులెన్స్‌లను అందిస్తా

- ఎంపీ రఘునందన్ రావు



నవతెలంగాణ- దుబ్బాక

నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో దుబ్బాక ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తన పుట్టినరోజు కానుకగా రూ.50 లక్షల సొంత ఖర్చులతో దుబ్బాక ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆసుపత్రికి అందించిన అంబులెన్స్ ఎంతో మంది ప్రాణాలను నిలబెట్టగలుగుతుందని ఇది తనకెంతో సంతృప్తిని కలిగించిందని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు అన్నారు. నెలకు 150 మంది ప్రాణాలను నిలబెట్టుగలుగుతున్న ఇలాంటి మరో రెండు అంబులెన్స్‌లను త్వరలోనే అందిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. దుబ్బాక పురపాలిక పరిధిలోని ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆసుపత్రిని మెదక్ ఎంపీ రఘునందన్ రావు సోమవారం సందర్శించారు. ఆస్పత్రి రోగులను పలకరిస్తూ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.ఆర్థోపెడిక్ డాక్టర్, ఇంకా పలు పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు. త్వరలోనే వైద్య, ఆరోగ్యశాఖ మంత్రితో ఈ ఏరియా ఆసుపత్రికి వస్తానని చెప్పారు. తాను విరాళంగా అందించిన అంబులెన్స్ పై తన ఫోటోతో పాటు ముఖ్యమంత్రి ఫోటోలను వేయించాలని ఆసుపత్రి సూపరింటెడెంట్ డా.హేమారాజ్ సింగ్‌ను ఆదేశించారు. ఆయన వెంట కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి అంబటి బాలేష్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు కిష్టమ్మగారి సుభాష్ రెడ్డి, పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి




నవతెలంగాణ- రాయపోల్

తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి వారికి ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం దౌల్తాబాద్ మండల అధ్యక్షులు అక్కం శేఖర్ అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులగా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఘనంగా నివాళులు అర్పించామన్నారు. కాంట్రాక్ట్ వ్యవస్థలో పని చేస్తూ చనిపోయిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు వెంటనే ప్రభుత్వం పది లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, వారి కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తామని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చినటువంటి హామీని నిలబెట్టుకోవాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులను చేసి విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా హెల్త్ కార్డుల మంజూరు చేయాలన్నారు. 12ఏళ్లగా సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం గుర్తించి శ్రమ దోపిడీకి గురికాకుండా శ్రమకు తగిన వేతనం సమాన పనికి సమాన వేతనం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి గాడి రాజు, పెంటయ్య, చంద్రమౌళి, నగేష్, మనోహర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నేతన్నల సమస్యల్ని పరిష్కరించేందుకు కృషి చేస్తా


- బూర మల్లేశం



నవతెలంగాణ- దుబ్బాక

తెలంగాణ రాష్ట్రంలో చేనేతల సంక్షేమానికి, వారి సర్వతోముఖాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని బూర మల్లేశం తెలిపారు. సోమవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమానికి సిద్దిపేట జిల్లా పద్మశాలి సమాజం అధ్యక్షుడు కస్తూరి సతీష్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘానికి జరుగుతున్న ఎన్నికల్లో రాత్నం గుర్తుపై ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా చేనేతల బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఎన్నికల్లో నాయకులు చేనేతలను ఓటు బ్యాంకుగా మాత్రమే పరిగణిస్తున్నారని, వారి జీవనస్థితిగతుల్లో ఎలాంటి మార్పు రావడంలేదని పేర్కొన్నారు. నేతన్నలు ఐక్యంగా ఉండి దీర్ఘకాలికంగా మనకున్న అపరిష్కృతం కానీ చేనేతల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కొరకు పట్ల సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో దుబ్బాక పద్మశాలి సమాజం అధ్యక్షుడు గాజుల తిరుపతి, కార్యవర్గ సభ్యులు, పలు పాండి ల పెద్దలు పాల్గొన్నారు.


ఘనంగా ఎస్‌టీఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుక



నవతెలంగాణ- గజ్వేల్

స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఏర్పడి 25 ఏళ్ల పూర్తయిన సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని టీఎస్ యూటీఎఫ్ డివిజన్ కార్యాలయంలో ఎస్‌టిఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు వి.సత్యనారాయణ పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయిలో విద్యారంగ సమస్యలు ఉపాధ్యాయుల సమస్యల పట్ల ఎస్‌టీఎఫ్ఐ నిరంతరం కృషి చేస్తుందని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంలోని లోపాలను ఎత్తిచూపుతూ ఆ దిశగా మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌టీఎఫ్ఐ జాతీయస్థాయిలో ఉద్యమాలు చేసిందని, విద్యారంగాన్ని కాపాడుకోవడంలో నిరంతర పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ వలి అహ్మద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాల్లోని భావసారుప్యమున్న సంఘాలు ఏకమై జాతీయ స్థాయిలో ఎస్‌టీఎఫ్ఐ ఏర్పడిందని ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యావిధానాన్ని కేంద్రం తన ఆధీనంలో తీసుకోవాలని చూస్తుందని నూతన విద్యా విధానం ద్వారా ప్రయివేటీకరణ, విదేశీ యూనివర్సిటీలను ప్రోత్సహించే విధంగా ఉండటం అనేది సామాన్యునికి విద్యను దూరం చేయడమే అని పేర్కొన్నారు. దీన్ని ఎదుర్కోవడానికి జాతీయస్థాయిలో ఎస్‌టీఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు జరుపుతున్నామని, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడమే ధ్యేయంగా ఎస్‌టీఎఫ్ఐలో భాగంగా టీఎస్‌యూటీఎఫ్ పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు ఎం.రవీందర్, జి.వెంకట్ కిరణ్, ఎస్.సుధాకర్ టి.శ్రీనివాస్ రెడ్డి, యం.సక్రియ, కృష్ణ, రాంచంద్రం. పి.రవి, ప్రశాంత్ టి.సునీల్, యం.శ్రీనివాస్ ఉపాధ్యాయులు , తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు




నవతెలంగాణ-సిద్దిపేట

వాసవి క్లబ్ ఆధ్వర్య ంలో ఐపీసీ ఆఫీసర్ నేతి వేణు కుమార్ పుట్టినరోజు సందర్భంగా వైశ్య భవన్ గోశాలలో గో సేవ, కొమరవెల్లి అశోక్ పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నదానం నిర్వహించినట్లు ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ గంప కృష్ణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు చకిలం రవి, కోశాధికారి ఇల్లెందుల నాగేందర్, వైశ్య భవన్ అధ్యక్షుడు ఐత బాల రాజేశం, పోశెట్టి శ్రీకాంత్, కొత్తూరు అశోక్, గట్టు విట్టల్, జూలూరి శ్రీనివాస్, హరికిరణ్, బుక్క శివ, సంతోష్, సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


- హెచ్ ఈవో వెంకటరమణ



నవతెలంగాణ-మర్కుక్

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజ లు అప్రమత్తంగా ఉండాలని హెచ్‌ఈవో వెంకటరమణ అన్నారు. సోమవారం మండలంలోని చేబర్తి గ్రామాన్ని ఆయన సందర్శించి పలు వీధుల్లో అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలతో కలిసి తిరుగుతూ డెంగ్యూ వైరస్ ద్వారా ప్రజల కు అవగాహన ఉండాలనీ గ్రామస్తులకు సూచించారు. అనంతరం స్థానిక అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ బాలింతల విద్యార్థుల టీకా రిజిస్టర్లను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్వాడీ టీచర్లు రాణి, స్వప్న ,ఆశా వర్కర్లు ధనలక్ష్మి, లత, తదితులున్నారు.


గ్రామాన్ని సందర్శించిన మర్కుక్ ఎస్ఐ



నవతెలంగాణ -మర్కుక్

సోమవారం మండల పరిధిలోని దామరకుంట గ్రామాన్ని ఎస్ఐ సందర్శించి, ప్రజల రక్షణ, సెన్సాఫ్ సెక్యూరిటీ, సీసీ కెమెరాలు చాలా ముఖ్యమని సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీస్ శాఖకు సహకరించాలనీ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని గంజాయి డ్రగ్స్, మత్తు పదార్థాల జోలికి వెళ్ళవద్దనీ అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆరా తీశారు. ప్రజల రక్షణ సెన్సాఫ్ సెక్యూరిటీ గురించి సీసీ కెమెరాలు చాలా ముఖ్యమని 24 గంటలు పనిచేస్తాయని సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ ప్రజలు పెద్దలు వ్యాపారస్తులు ప్రజాప్రతినిధులు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్థులు, తదితరులున్నారు


ఇంటి నిర్మాణాన్ని పరిశీలించిన ఎంపిఓ



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండలం ఆకు నూ రు గ్రామంలో స్వర్గం యాదగిరి నూతనంగా నిర్మిస్తు న్న ఇంటి నిర్మాణ విషయంలో గ్రామ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కార్యదర్శి పులి బాలయ్యకు మెమో జారీ చేసిన విషయం తెల్సిందే. కాగా వివాదానికి కారణమైన నూతన నిర్మాణాన్ని చేర్యాల ఇంచార్జ్ ఎంపీడీవో, మండల పంచాయతీ అధికారి మహబూబ్ అలీ సోమవారం పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణం కోసం అనుమతులు విషయంలో,ప్రభుత్వ నిబంధనల ప్రకారం సెట్ బ్యాక్, సంబంధిత ప్లాటు రిజిస్ట్రేషన్ విషయంలో, నిర్మాణం సమయంలో కార్యదర్శి వ్యవరించిన తీరును పరిశీలించి సంబధిత జిల్లాఅధికారికి నివేదిక పంపినట్లు తెలిపారు.

కమలాయపల్లిలో అధ్వానంగా పారిశుధ్యం



నవతెలంగాణ-మద్దూరు

చేర్యాల మండలంలోని కమలాయపల్లి గ్రామంలో చిన్న వానలకే రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. గ్రామంలో పూర్తిగా పారిశుధ్యం లోపించిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం గ్రామస్తులు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో చిన్న వానలకు రోడ్లన్నీ చెరువులను తలపించే విధంగా నీరు నిలవడంతో వాహన దారులకు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారన్నారు. గ్రామంలో వీధిలైట్లు సైతం రావడంలేదని పంచాయతీ కార్యదర్శి గ్రామాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని తెలిపారు. మండల అధికారులు గ్రామాన్ని పర్యటించిన దాఖలాలు లేవని వారు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామాల్లోని వీధులన్నీ శుభ్రం చేసి నీరు నిలవకుండా చేయాలని, వీధిలైట్లు వేయాలని గ్రామస్తులు కోరారు.

మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-నంగునూరు

మండల కేంద్రమైన నంగునూరులోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మూడు రోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని మంగు వారి ధార్మిక సంస్థ చైర్మెన్ మంగు రాధా కిషన్ రావు, ఆలయ నిర్వహణ కమిటీ బాధ్యులు తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 16వ,17వ,18వ తేదీల్లో ఉత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 18న శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.


అనాథ పిల్లలకు నోట్స్ బుక్స్ పంపిణీ



నవతెలంగాణ- మర్కుక్

మండలంలోని చేబర్తి గ్రామానికి చెందిన అనాథ పిల్లలు దేశమైన మహేశ్, ప్రవళికలకు సోమవారం అర్థిక చేయూత పౌండేషన్ సభ్యులు నోట్ బుక్స్, బ్యాగ్స్, షూ, స్టేషనరీ సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక చేయూత ఫౌండేషన్ సభ్యులు దుబ్బాసి రమేశ్, తాడూరి వెంకట్ రాంరెడ్డి, పోయిల రమేశ్, ఎముడాల రాజు, పబ్బ శ్రీకాంత్, లింగని మల్లేశ్, తదితరులున్నారు.


కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి నియామకం



నవతెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శిగా చెర్ల అంకిరె డ్డిపల్లి గ్రామానికి చెందిన చిక్కుడు అనిల్ కుమార్ ను నియామిస్తూ నియామక పత్రాన్ని బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్య వర్మ, డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్ యాదవ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్త కు పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని ,పార్టీ అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త సైనికుని వలె పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు సింగిరాల రాజు, యూత్ కాంగ్రెస్ ఉడుత ప్రశాంత్, నాయకులు రమేష్, వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం



నవతెలంగాణ-నంగునూరు

కళాశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రిన్సిపాల్ బి.కిషన్ పేర్కొన్నారు. సోమవారం నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మెడికల్ చెకప్‌లు నిర్వహించారు. రాష్ట్రీయ బాల్ స్వస్థీయ కార్యక్రమం (ఆర్బీఎస్కే)లో భాగంగా మెడికల్ టీం అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ చేర్యాల వారి ఆధ్వర్యంలో ప్రథమ, ద్వితీయ ఏడాది విద్యార్థులకు పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.శ్రీజ, ఫార్మాసిస్ట్ పి.రంజిత్ కుమార్, ఏఎన్ఎం వి.శ్వేత, కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.